# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 22 మార్చి 2025


## ప్రతి అమ్మాయి శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి

### అన్ని హాస్టల్స్ వద్ద సిసి కెమెరాలు తప్పనిసరి: మన్నూరు సి ఐ కులాయప్ప

**రాజంపేట అర్బన్, మార్చి 21 ప్రభాతవార్త**



మహిళల సంరక్షణ కోసం పోలీస్ శాఖ అమల్లోకి తీసుకువచ్చిన శక్తి యాప్ ప్రతి ఇంజనీరింగ్ అమ్మాయి డౌన్లోడ్ చేసుకోవాలని మనూరు సిఐ కులాయప్ప కోరారు. శుక్రవారం రాజంపేట మండలం బోయినపల్లి లోని అమ్మాయిల హాస్టల్స్ వద్ద అవగాహన కార్యక్రమాలను సిఐ నిర్వహించారు. ఇంజనీరింగ్ అమ్మాయిలతో మాట్లాడారు. ఆపదలో ఉన్నప్పుడు శక్తి యాప్ మీకు తోడుగా ఉంటుందని సూచించారు. అలాగే ప్రతి హాస్టల్ లోనూ నిర్వహకులు సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హాస్టల్లో అసాంఘిక కార్యక్రమాలు ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని కోరారు.

## బలే..బలే...వింతైన... జంటల టెంకాయచెట్లు

**రామసముద్రం, మార్చి 21 ప్రభాతవార్త :**

ఒకే మొదుల్లో రెండు టెంకాయచెట్లు ఏపుగా ఉన్నాయి. పక్కపక్కనే ఇవి ఉండి ఏపుగా పెరిగాయి. రహదారిపక్కనే ఈ చెట్లు ఉండడంతో ప్రయాణికులను ఆకర్షిస్తున్నాయి. రామసముద్రం మండలం కాపల్లె సమీపంలోని రోడ్డు పక్కన రెండు టెంకాయచెట్లు ఒకే మొదుల్లోనే పెరిగాయి. వీటి మద్యన కొంత దూరంలో మరో టెంకాయ చెట్టు ఉంది. దగ్గరకు వెళ్ళి చూస్తే ఈ చెట్లు మూడుగా కనపడి కనువిందు చేస్తున్నాయి. కొత్తపల్లి సమీపంలోని రోడ్డు పక్కన రెండు టెంకాయచెట్లు ఆకాశం ఎత్తు ఉండేలా ఏపుగా పెరిగి ఉన్నాయి. ఈ రెండు చెట్లు కూడా ఒకే మొదలు నుంచే పక్కపక్కన ఉండి పెరిగాయి. వీటిని ఆసక్తిగా చూస్తున్నారు.





## ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి సూచనలు, సలహాలు అందజేయాలి

**రాయచోటి, మార్చి 21 ప్రభాతవార్త**

జిల్లాలో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి చట్టానికి అనుగుణంగా సూచనలు, సలహాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రాజకీయ పార్టీలను కోరారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ మరియు రాజ్యాంగం అమలులో రాజకీయ పార్టీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఎన్నికల ప్రక్రియ గురించి ఈఆర్వో, డిఈఓల స్థాయిలో పరిష్కారం గాని ఏవైనా సమస్యలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం అన్ని జాతీయ మరియు రాష్ట్ర రాజకీయ పార్టీల నుండి సూచనలు ఆహ్వానిస్తోందన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన ప్రజా ప్రాతినిధ్య చట్టం, ఓటర్ల నమోదు నియమాలు, ఎన్నికల నియమాల నిర్వహణ, గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలు మరియు భారత ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, మాన్యువల్స్ మరియు హ్యాండ్ బుక్కులు (ఈసీఐ వెబ్సైట్లో అందుబాటులో ఉన్న) అంశాలపై అన్ని జాతీయ మరియు రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి ఏప్రిల్ 30 నాటికి సూచనలు సలహాలు అందజేయాల్సి ఉందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుసరించి జిల్లాలో పటిష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను తప్పనిసరిగా నియమించుకోవాలన్నారు. అలాగే పోలింగ్ బూతు లెవెల్ మరియు గ్రామస్థాయిలలో సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను దృష్టికి తీసుకురావాలని కోరారు. వయోజనులు, యువత ఓటర్ల నమోదు శాతం పెరిగేందుకు కూడా రాజకీయ పార్టీలు కృషి చేయాలన్నారు. స్వేచ్ఛగా మరియు నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహించడానికి బలమైన మరియు పారదర్శక ఎన్నికల ప్రక్రియ ఏర్పాటు కోసం రాజకీయ పార్టీలన్నీ తమ వంతు సహకారం అందించాలన్నారు. జిల్లాలో ఎన్నికల పటిష్ట నిర్వహణకు సూచనలు సలహాలు అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రెండు చోట్ల ఈవీఎంల ను పగలగొట్టేందుకు ప్రయత్నించారని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట చర్యలు తీసుకోవాలని, 1200 పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజించి నపుడు సదరు సమాచారాన్ని రాజకీయ పార్టీలకు అందించాలని కోరారు. అలాగే పోలింగ్ కేంద్ర భవనాల మార్పు, పోలింగ్ కేంద్రాలలో సమస్యల గుర్తింపు, బిఎల్ఏలను మార్చుకునే అంశం తదితరాలను సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటన్నిటికీ కలెక్టర్ తగు సమాధానాలు తెలిపారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. గోదాములోని ఈవీఎంల బియు, సియు, వివి ప్యాట్ లను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రెడ్డప్పరెడ్డి, తాసిల్దార్ నరసింహ కుమార్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## అన్నమయ్య జిల్లాలో పెద్ద ఎత్తున పోలీసుల బదిలీలు

### జిల్లా ఎస్పీ నిర్ణయం పట్ల సర్వత్ర హర్షం

**రాజంపేట అర్బన్, మార్చి 21 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లాలో పెద్ద ఎత్తున పోలీస్ శాఖలో బదిలీలు జరిగాయి. జిల్లా ఆవిర్భావం తర్వాత ఇంత పెద్ద ఎత్తున బదిలీలు ఎప్పుడు జరిగ జరగలేదు. ముఖ్యంగా రాజకీయాలకు అతీతంగా బదిలీలు జరిగినట్టు తెలుస్తోంది. బదిలీల్లో పారదర్శకత స్పష్టంగా కనిపిస్తోంది. ఏ స్టేషన్లో అయినా ఐదు సంవత్సరాలకు కంటే మించి పని చేసిన వారిని బదిలీ చేశారు. అదే అంతేకాకుండా ఐదేళ్లు దాటిన వారికి ఆప్షన్ కూడా ఇచ్చారు. దీంతో చాలామంది పోలీసులు జిల్లా ఎస్పీని కలిసి తమ బాధలు చెప్పుకోవడమే కాకుండా తమకు అనువైన స్టేషన్లను కూడా చెప్పారు. చాలావరకు ఆయా స్టేషన్లో వారి పనితీరు ఆధారంగా బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. పనిచేస్తున్న చోట మంచి ట్రాక్ రికార్డు ఉన్నవారికి వారు కోరుకున్నట్లుగానే పోస్టింగ్ కూడా ఇచ్చినట్లు సమాచారం. అయితే ఒకే సబ్ డివిజన్లో ఎక్కువ కాలం పనిచేసిన వారిని తప్పనిసరిగా మరో సబ్ డివిజన్ కు బదిలీ చేశారు. జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు తీసుకున్న నిర్ణయం పై పోలీసు వర్గాల్లో చాలావరకు మంచి స్పందన కనిపిస్తోంది. గతంలో ఇలాంటి బదిలీలు తాము చూడలేదని చెబుతున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసే పోలీసులకు వారు కోరుకున్న విభాగాల్లోనే పోస్టింగ్ ఇవ్వడం విశేషం. మొత్తానికి ఒకేసారి జిల్లాలో 392 మందికి బదిలీలు జరిగాయి. అందులో 228 మంది కానిస్టేబుళ్ళు, 123 మంది హెడ్ కానిస్టేబుళ్ల ,41 మంది ఏఎస్ఐలు ఉన్నారు. త్వరలోనే జిల్లాలో ఎస్ ఐ, సిఐ బదిలీలు కూడా జరుగుతాయని ప్రచారం జోరుగా జరుగుతోంది.

## బాధిత కుటుంబాలకు భరోసా సిఎంసహాయ నిధి

### తెదేపా జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు



**రాజంపేట అర్బన్, మార్చి 21 ప్రభాతవార్త**

అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి అని తెదేపా పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. శుక్రవారం రాజంపేట క్యాంప్ కార్యాలయంలో దేరంగుల అరుణ బాధిత కుటుంబానికి 9,07,696 సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా,వైద్యం అనేది చాలా ఖర్చుతో కూడుకున్న పని అన్నారు. ఒక కుటుంబంలో ఒక వ్యక్తి అనారోగ్య మారిన పడితే మొత్తం కుటుంబానికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందనన్నారు. అలాంటి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందించే సీఎం సహాయనిధి కుటుంబాన్ని నిలబెట్టే ఆయుధంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి పొందిన బాధితులు మాట్లాడుతూ వైద్యం కోసం అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు పడ్డామని తమకు చేయూతని అందించిన ప్రభుత్వానికి, తమకు సహకరించిన పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూసీఐఎల్ లో ముగిసిన భద్రతా వారోత్సవాలు

**పులివెందుల రూరల్, మార్చి 21, ప్రభాతవార్త :**





వేముల మండలంలోని యూసీఐఎల్ కంపెనీలో నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాలు శుక్రవారం తో ముగిశాయి. సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన కార్యాలయాన్ని పెంపొందించడానికి ఈ వారోత్సవాలు బలోపేతం చేసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప జిల్లా జిల్లా అటవీ అధికారి శ్రీ ఎం. శివ కుమార్, జనరల్ మేనేజర్ (మిల్లు) సుమన్ సర్కార్ హాజరయ్యారు. ఉద్యోగులు భద్రత, ఆరోగ్య ప్రతిజ్ఞను స్వీకరించారు, కార్యాలయ భద్రతను కాపాడుతామని, నిబంధనలను పాటిస్తామని మరియు ప్రమాదాలు మరియు వృత్తిపరమైన ప్రమాదాలను నివారించే అలవాట్లను పెంపొందించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సంవత్సరం వేడుకల్లో భద్రతా అవగాహనను ప్రోత్సహించడానికి బహుళ పోటీలు ఉన్నాయి. మొత్తం 95 మందికి పైగా ఉద్యోగులు వివిధ భాషలలో వ్యాస రచన, నినాదాల పోటీ, పోస్టర్ తయారీ మరియు భద్రతా క్విజ్తో సహా వివిధ పోటీలలో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో, ఈ పోటీలలో విజేతలను జనరల్ మేనేజరు సుమన్ సర్కార్, అకౌంట్స్ డీజీఎం శ్రీకాంత్ తదితరులు సత్కరించారు. ఈ పోటీలలో ప్రదర్శించబడిన ఉత్సాహం మరియు సృజనాత్మకత గీది।లి యొక్క బలమైన భద్రతా అవగాహన సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ప్రత్యేక గుర్తింపు విభాగంలో, కార్యాలయ భద్రత మరియు పరిశుభ్రతను కాపాడుకోవడంలో వారి అసాధారణ కృషికి "సేఫ్టీ హౌస్ కీపింగ్ అవార్డు 2025"తో సత్కరించబడిన ఉద్యోగులు వై. రాజేశ్వర రెడ్డి (మెకానికల్మిల్ విభాగం), ఎ. పవన్ కుమార్ రెడ్డి (ఇన్స్ట్రుమెంటేషన్ విభాగం), ఆర్. రుకు మాంగడ రెడ్డి (ఎలక్ట్రికల్ విభాగం), జి. గోపీనాథ్ రెడ్డి (మిల్ హౌస్), జి. నాగేంద్ర (కెమికల్ విభా గం). ఈ కార్యక్రమంలో సుమన్ సర్కార్ మాట్లాడుతూ, నిరంతర భద్రతా మెరుగుదలల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు, ' వేడుకలు ముగిసినప్పటికీ, UCIL భద్రత పట్ల తన నిరంతర నిబద్ధతను పునరుద్ఘాటించింది, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని మరియు భద్రతను కేవలం ఒక అభ్యాసంగా కాకుండా ఒక అలవాటుగా మార్చుకోవాలని కోరారు. సురక్షితమైన కార్యాలయం ఉత్పాదక కార్యాలయం అని కృతజ్ఞతలు తెలుపుతూ మరియు గుర్తు చేస్తూ ఈ కార్యక్రమం ఘనంగా ముగిసింది. అభిజ్ఞాన్, వాసుదేవ్ రెడ్డి, గౌతమ్ కె., మోహన్ రెడ్డి, విజయ్ కుమార్, విలియం క్యారీ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆక్రమణ స్థలాల క్రమబద్ధీకరణ పై సర్వే

**గోపవరం ,మార్చి 21, ప్రభాతవార్త**



మండల పరిధిలోని బాలయోగి గురుకుల పాఠశాల వెనుకవైపు ఉన్న ఆక్రమిత స్థలాలలో శుక్రవ్నార తహసిల్దార్ రెడ్డి బద్వేల్ మున్సిపల్ కౌన్సిలర్ నరసింహారెడ్డిలు సర్వే చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ప్రజలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ అనధికార ఆక్రమణ స్థలలోని ఇళ్ల క్రమబద్ధీకరణ పథకం, 2025 ద్వారా రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణకు అర్హతలు: తెలియజేశారు. ఇందులో భాగంగా15.10.2019 తేది నాటికి అనధికార ఆక్రమణ స్థలంలో నివాస గృహం నిర్మించి నివసిస్తూ ఉండాలని, కుటుంబంలోని మహిళా సభ్యురాలు మాత్రమే క్రమబద్ధీకరణకు అర్హులన్నారు. లబ్ధిదారుని కుటుంబం లేదా కుటుంబంలోని ఏ సభ్యుడైనా రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వ మునుపటి ఏ గృహ నిర్మాణ పథకంలోనూ ఉండకూడదన్నారు. అలాగే లబ్ధిదారుని కుటుంబానికి లేదా కుటుంబంలోని ఏ సభ్యునికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడా సొంత ఇల్లు/ఇంటి స్థలం ఉండకూడదని తెలిపారు. ఈ పథకం కింద ఎవరైనా వారి కేటాయింపు ఉత్తర్వులను పొందినట్లయితే, అటువంటి లబ్ధిదారులు తమకు కేటాయించిన నివాస యూనిట్ను విక్రయించినప్పటికీ, ఇంటి స్థలం కేటాయింపుకు అర్హులు కారని, 300 చదరపు గజాలు పై బడిన నివాస గృహాలకు బేసిక్ వేల్యూ మరియు రిజిస్ట్రేషన్ వేల్యూ లో తగు నిష్పత్తి ప్రకారం చార్జీలు చెల్లించవలెనన్నారు. ఇందుకోసం ఆధార్ కార్డు , రేషన్ కార్డు, ఇప్పటి ఇంటి పన్ను రశీదు, కరెంట్ బిల్ మొదలగు డాక్యుమెంట్ లతో మీ సచివాలయం నందు సంప్రదించవలెనన్నారు. వీరి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

## మహిళచేతిలో శక్తి



**పీలేరు, మార్చి 21 ప్రభాతవార్తః**

మహిళలు, ఆడబిడ్డల రక్షణ కోసం కూటమిప్రభుత్వం పెద్ద పీఠ వేస్తోంది. ఇందులో భాగంగా స్త్రీ శక్తి యాప్ను ప్రవేశపెట్టి సీఎం చంద్రబాబు నాయుడు ఇటీవల దీన్ని ప్రారంభించారు. ఉమెన్ ప్రొటెక్షన్ వింగ్ పేరుతో దీన్ని ప్రజల్లోకి తతీసుకెళ్లడానికి కార్యాచరణతో ముందుకు వెలుతున్నారు.

- **నమోదు ఇలా...** శక్తి యాప్ ఏపీ పోలీసు చరవాణి,, గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్ లోడుచేసుకోవాలి, మొబైల్నెంబరుకు వచ్చే ఓటీపీతో ఇందులో నమోదు చేసుకోవచ్చు,. ఆపై వచ్చేఎంపికలో పేరు, చిరునామ, ఫోన్ నెంబరు, లోకేషన్ తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యులు బంధువులవివరాలు అందుబాటులో ఉండే రెండు ఫోన్ నెంబర్లను నమోదు చేయాల్సి ఉంటుంది.
- **క్షణాల్లో సమాచారం..** అత్యవసర సమయంలో యాప్ను ఓపెన్చేసి అందులోని ఎస్ఓఎస్పై నొక్కితే ఆటోమెటిక్గా ఫోన్లోని కెమరా ఆటోమెటిక్గా ఆన్ ఆవుతుంది. పది సెకన్ల వీడియో రికార్డు దానంతట అదే చేసుకుంటుంది. ఈసమాచారాన్ని పోలీసు కంట్రోల్కు యాప్ ద్వారా అందిస్తుంది. వెంటనే అప్రమత్తమై పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ఆపదలో ఉన్నవారికి రక్షణ కల్పిస్తారు. పిల్లలు తప్పి పోతే ఫిర్యాదు చేసే సౌకర్యం కూడా ఇందులో ఉంటుంది. ఈయాప్లో సురక్షతమైన ప్రయాణం , రాత్రి పూట ఆశ్రయాలు, కుటుంబ సలహాలు, తదితర ఫిర్యాదులను ఎంపిక చేసుకునే అవకాశం కూడా ఉంటుంది.
- **నమోదు చేసుకోండి ఇలా...** మహిళలు , యువతులు చరవాణిలో ఖచ్చితంగా స్త్రీ శక్తి యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఈయాప్ను డౌన్లోడ్ చేసుకోవడంతో రద్దీ ఎక్కువగా ఉండే బస్టాండులు, కళాశాలలు, షాపింగ్ మాల్స్, తదితర ప్రాంతాలకు వెళ్లే మహిళలు, యువతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.
- **అండగా ఉంటాం...** బాలికలు, మహిళలు, చిన్నారుల రక్షణ, భద్రత స్త్రీ శక్తి ముఖ్య లక్ష్యం, దీన్ని సెల్ఫోన్లలో డౌన్లోడ్ చేసుకోవాలి. ఈవ్టీజింగ్, బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు గురించి సహాయపడే టోల్ఫ్రీ నెంబర్లు 112, 181, 1930, 1098, ఫోన్ చేసి సహాయం పొందవచ్చు.

## ప్రజా సేవలో ఉంటూ ప్రజలకు అండగా నిలుస్తా

**ప్రొద్దుటూరు మార్చి 21 ప్రభాతవార్త**



నియోజకవర్గంలో ప్రజలు తనను కోరుకున్న విధంగా నిత్యం ప్రజా సేవలో ఉంటూ ప్రజలకు అండగా నిలుస్తానని తన జీవితం ఎమ్మెల్యే పదవి ప్రజలకే అంకితం చేస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి ఉద్ఘాటించారు. శుక్రవారం స్థానిక అభ్యాసం జూనియర్ కళాశాల ఆవరణలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తి అయిన నేపథ్యంలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 65 వేల మంది కార్యకర్తలు సభ్యత్వాన్ని పొందినట్లు వరద పేర్కొన్నారు. ఈ సభ్యత్వ గుర్తింపు కార్డులను నియోజకవర్గంలోని నాయకులు క్లస్టర్ ఇంచార్జిలు బూతు ఇన్చార్జులు బాధ్యతగా తీసుకొని ప్రతి వార్డులో ప్రతి కార్యకర్తకు గుర్తింపు కార్డులు ఇంటికి చేర్చి దానివల్ల చేకూరే లబ్ధిని వివరించాలని తెలిపారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా తనను ప్రజలు కోరుకున్న విధంగా పాలన కొనసాగిస్తానని హామీ ఇచ్చారు గత సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన సర్వేలో 70 పైగా తనను ఎమ్మెల్యేగా వరద ఉంటేనే బాగుంటుందని కోరుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు కొన్నిటిని అమలు చేయగా మరికొన్నిటిని త్వరలోనే అమలుకు నోచుకుంటున్నాయని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన ప్రతి కార్యకర్త తోడుగా నిలిచి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం సభ్యత్వ గుర్తింపు కార్డులను వార్డు నాయకులకు కార్యకర్తలకు ఆయన పంపిణీ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి వి ఎస్ ముక్తియార్ పట్టణ అధ్యక్షులు ఇవి సుధాకర్ రెడ్డి వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు టిడిపి నాయకులు బచ్చల వీర ప్రతాప్ పగిడాల దస్తగిరి రిటైర్డ్ ఎమ్మార్వో శివశంకర్ తలారి రమేష్ కాచన శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టి బి వ్యాధిని అంతం చేద్దాం

**సుండుపల్లి, మార్చి 21, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని రాయవరం పీహెచ్ సి నందు టీబీ మాసోచ్ఛావా సందర్భంగా డాక్టర్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహనా శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది ఆయన మాట్లాడుతు రెండు వారల పైబడి దగ్గు, సాయంకాలం జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు దగ్గడం, ఛాతిలో నొప్పి రావడం, దగ్గినపుడు గళ్ళతో పాటు రక్తం పడడం మరియు టీబీ వ్యాధి ఊపిరితిత్తులకు కాకుండా శరీరంలో ఇతర భాగాలకు కూడా జబ్బు వచ్చేఅవకాశం ఉంది. ఈ లక్షణాలు ఉన్నపుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గళ్ళ పరీక్ష చేసి జబ్బు నిర్ధారణ అయితే ఉచితంగా మందులు ఇవ్వబడును. మరియు ఎక్స్ రె ద్వారకూడా నిర్ధారణ చేస్తారు 6 నెలలు మందులు వాడితే పూర్తిగా నయం అవుతుంది. మరియు ఫోసకాహారం కొరకు 500/డబ్బులు ఇవ్వబడును అని తెలియజేసారు. ఈ ప్రోగ్రాం నందు ఎంపిఇఒ వీర నారాయణ సిహెచ్ఒ సాల్మహన్ ఎ ఎన్ఎం నాగభాషణమ్మ మరియు ఆశాలు పాల్గొన్నారు.

## ధరలు లేక దిగాలు చెందుతున్న టమోటా రైతన్న

**రామసముద్రం, మార్చి 21 ప్రభాతవార్త :**



మండలంలోని టమోటా పంట రైతులకు ధరలు లేక గత పది రోజులుగా తగ్గుముఖం పడుతుండడంతో టమోటా రైతులు తీవ్ర ఇందోళన చెందుతున్నారు. శుక్రశారం బజారులో పదికిలోల బాక్స్ రెండవ రకం ధర రూ.60లు పలికింది. దిగుబడి తక్కువుగా ఉన్న ధరలు పెరగడం లేదంటూ రైతులు వాపోతున్నారు. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ లేకపోవడం వల్ల ధరలు పెరగడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు గిట్టుబటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతిని నమ్ముకొని భూమిపై ఆధారపడి ఒక పంట పోతే మరో పంట వస్తుదన్న ఆశతో టమోటా పంట వేసి దిగుబడి బాగా వచ్చినా పంటకు గిట్టుబాటు ధర లేదు. చేసిన అప్పులు తీర్చలేక అప్పులు పాలైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### సమర్థవంతమైన పౌర సేవలే..

## "మిషన్ కర్మయోగి" లక్ష్యం..!!..

**కడప, మార్చి 21, ప్రభాతవార్త:**

భారతీయ నైతికతలో సమర్థవంతమైన పౌర సేవను సృష్టించే లక్ష్యంతో, ప్రభుత్వ ఉద్యోగులు ఓర్పు, నేర్పుతో ఉద్యోగ విధులు నిర్వహించే లక్ష్యంతో "మిషన్ కర్మయోగి" ఆన్లైన్ అభ్యాస వేదికను ప్రభుత్వం అమలుచేస్తోందని.. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సభా భవన్ లో.. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో.. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న "బివీగి కర్మయోగి పోర్టల్" నిర్వహణపై అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఆర్వో విశ్వేశ్వర నాయుడు తోపాటు జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి హాజరతయ్య హాజరై.. పోర్టల్ నిర్వహణపై పిపిటి ప్రెసెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. మిషన్ కర్మయోగి నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ సివిల్ సర్వీసెస్ కెపాసిటీ బిల్డింగ్ (NPCSCB) సివిల్ సర్వీస్ అధికారులకు కర్మయోగి భారత్ పోర్టల్ను భారత ప్రభుత్వం అందిస్తుందన్నారు. మిషన్ కర్మయోగి న్యూ ఇండియా దార్శనికతకు అనుగుణంగా సరైన వైఖరి, నైపుణ్యాలు మరియు జ్ఞానంతో కూడిన భవిష్యత్తు నిర్మాణం కోసం పౌర సేవను నిర్మించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆకాంక్షిస్తున్నాయన్నారు. అధికారుల భవిష్యత్తును పటిష్టం చేసి దిశగా.. నిరంతరం ఎప్పుడైనాఎక్కడైనా నేర్చుకునేలా బలమైన డిజిటల్ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా పౌర సేవల సామర్థ్య నిర్మానాత్మక వ్యూహంగా మార్చడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. కర్మయోగి భారత్ దార్శనికత, భారత పౌర సేవల సామర్థ్య నిర్మాణ దృశ్యాన్ని మార్చడం, తద్వారా అధికారులు భవిష్యత్తులో సిద్ధంగా ఉండటానికి, ఎప్పుడైనాఎక్కడైనా నిరంతర అభ్యాసాన్ని అనుమతించే బలమైన డిజిటల్ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ మిషన్ లక్ష్యం అన్నారు. మిషన్ కర్మయోగి ప్రభుత్వంపౌరుల మధ్య పరస్పర చర్యను పెంపొందించడం, అధికారులు పౌరులకు మరియు వ్యాపారానికి సహాయకులుగా మారడం, ప్రవర్తనాకార్యాచరణడొమైన్ సామర్థ్యాల అభివృద్ధి ద్వారా జీవన సౌలభ్యం మరియు వ్యాపార సౌలభ్యానికి దారితీస్తుంది. అందువలన, మిషన్ కర్మయోగి పౌర సేవా సంస్కరణల కోసం పౌరకేంద్రీకృత విధానాన్ని అవలంబిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ హరనాథ్, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## అడవులను రక్షించాలి.. పర్యావరణాన్ని కాపాడాలి

**సిద్దవటం, మార్చి 21, ప్రభాతవార్త:**

ప్రతి ఒక్కరూ అడవులను రక్షించి పర్యావరణాన్ని కాపాడాలని సిద్దవటం రేంజర్ బి.కళావతి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన సిద్దవటం శ్రీ సాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులు సిద్దవటం రేంజ్లోని సాబ్బావి బేస్ క్యాంప్ అటవీ ప్రాంతంలో అడవుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రేంజర్ కళావతి మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడాలని పచ్చని చెట్లు పెంపకం వల్ల అధిక వర్షాలు పడతాయన్నారు. అడవుల పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అడవుల్లో చెట్లు నరకడంకానీ, నిప్పు పెట్టడం కానీ నేరమని తెలిపారు. అడవుల్లో సహజంగా లభించే ఆయుర్వేద మొక్కలు వైద్యానికి చాలా ఉపయోగపడతాయన్నారు. అలాంటి అడవులను కొల్ల కొట్టరాదని ఆమె తెలిపారు. అంతే కాకుండా అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు అంతరించి పోకుండా వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కావునా అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను పడేయొద్దని తెలిపారు. అడవుల ప్రాముఖ్యత, వన్యప్రాణులు కాపాడే విషయమై విద్యార్థులకు అవగాహన కల్పించామని రేంజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, బీటు అధికారులు, ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది, ప్రొటక్షన్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ అభివద్దే లక్ష్యం...



పీలేరు,మార్చి 21 ప్రభాతవార్తః అనునిత్యం పీలేరు పట్టణంలో వేలాదిమంది వి విధ రకాల ఉద్యోగస్తులు, చేతివత్తుల పనివారు వి ద్యార్థులు అనేక రకాల వ్యాపారాలతో రద్దీగా ఉన్న పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోని మేజర్ పంచాయతీ పీలేరు పంచాయతీని మరెంత అభివద్ధి చేయడమే లక్ష్యంగా భావించి ఉన్నతాధికారులు, స్థానిక శాసన సభ్యులు ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తానని పీలేరు పంచాయతీ ఈఓ గురు మోహన్ అన్నారు. శుక్రవారంఆయన ప్రభాతవార్త తో మాట్లాడుతూ నియోజకవర్గ శాసన సభ్యులు న ల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, పీలేరు పట్టణాన్ని స్వచ్ఛా భారత్‌లో భాగంగా శుభ్రత పరిశుభ్రత పాటిస్తూ ప్ర జలకు ఎటువంటి సమస్యలు లేకుండాపట్టణాన్ని అభివద్ధి పరిచేందుకు కషిచేయాలని ఆదేశించడంతో ఆయన ఆదేశాలకు అనుగుణంగా పీలేరు గ్రామ పం చాయతీని అన్ని రకాల అభివద్ధి పనుల్లో భాగంగా వీధి దీపాలు, డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు, ము రికి కాలువలు శుభ్రం చేయడం, మంగళవారం జ రిగే వారపుసంత, దినసరి మార్కెట్‌లకు అనుని త్యం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే రైతులకు, ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పిస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. అదేవిధంగా ముస్లీంలు ఎం తో పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగను అ న్ని సౌకర్యాలకు జరుపుకునేందుకు మసీదులలో ఈ ద్గాలలో మంచినీటి సౌకర్యం, శుభ్రత పరిశుభ్రత ను పాటిస్తూ తనవంతు మైనారిటీ సోదరులకు సొంత ఖర్చులతో తేనీటి విందుతో పాటు రంజాన్ తోఫాలో భాగంగా పేదలకు తోచిన సహాయాన్ని అందించేందుకు ముందుకు వెళుతున్నానన్నారు. త మ కుటుంబం అన్నివిధాలుగా సహాయం చేయడా నికి మొదటి నుంచి అలవర్చుకునే గుణంలో భా గంగా తాను కూడా ఒక్కడినై పదిమందికి మంచి చే యాలనిపీలేరు పంచాయతీ ఈఓగా బాధ్యతలు తీసుకున్న అనంతరం తోటి పంచాయతీ అధికా రులతో సిబ్బందితో స్థానిక సర్పంచి హబీబ్‌బాషాతో కలిసిమెలసి పార్టీలకు అతీతంగా పార్టీ సూచనలతో ఎమ్మెల్యే కోటా నిధులతో పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దుతున్నామని ఆయన అన్నారు. పట్టణం లో అను నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రో జువారి కార్యక్రమాలకు వ్యాపారస్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆటో స్టాండుతో పాటు మార్కెట్ యార్డులో మంచినీటి సౌకర్యం కల్పించి పోలీసులకు ట్రాఫిక్ సమస్య రాకుండా చేస్తున్నా మని అదేవిధంగా పోలీసు, రెవెన్యూ ఫైరింగ్ స్టే షన్‌లతో కలిసి పనిచేయడమే కాకుండా ప్రస్తు తం 10వ తరగతి విద్యార్తులకు పరీక్షలు జరుగు తుం డటంతో పాఠశాలలో కూడా క్లీన్ అండ్ గ్రీన్ కార్య క్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు అన్ని సౌక ర్యా లు కల్పిస్తున్నామని ఈఓ అన్నారు. అనునిత్యం ప్ర జలతో కలిసి ప్రజా సమస్యలపై పంచాయ తీ పరి ధిలో కష్టసుఖాలను తెలుసుకోవడమే కా కుండా తమ పంచాయతీ పరిధిలో నిబంధనలకు అనుగు ణంగా పలు కార్యక్రమాలు కూడా ఈవో ని ర్వహి స్తుండటంతో పలువురు నాయకులు, అధికా రులు ఈఓను ప్రశంసిస్తుండటం ఆనంద దాయకం.

## ఆదర్శప్రాయుడు తిరుపతిరెడ్డి

పోరుమామిళ్ల రూరల్, మార్చి 21 ప్రభాతవార్త:



భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బద్వేల్ ప్రాంత ఉద్యమ నిర్మా త లో ఒక్కరైనా కామ్రేడ్ కల్లూరు తిరుపతి రెడ్డి సందర్భంగా 10 వ వర్ధంతి సందర్భంగా శు క్రవారం ఆయన స్వగ్రా మమైన రాజ సాహెబ్ పేట లో నిర్మించిన ఆయన స్తూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా సిపి ఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్ లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికు మార్, జిల్లా సమితి సభ్యులు పడిగే వెంకటరమణ లు మాట్లాడుతూ ఈ ప్రాం తంలో రైతు ఉద్యమ నాయకుడిగా, నిరంతరం పార్టీ కోసం పనిచేసిన వ్యక్తిగా, బద్వేల్ నియోజకవర్గం లో పార్టీ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటారు. అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి గా పేరుపొందిన కామ్రేడ్ గా కామ్రేడ్ కల్లూరు తిరుపతి రెడ్డి అన్నారు. ఆయన పేరుతో పేదలతో కూడిన పురాణాల పట్టణంలో తిరుపతి రెడ్డి కాలనీ ఏర్పాటు చేసుకొని 11 సంవత్సరాల నుండి ఇంటి పట్టాల కోసం పోరాటం కూడా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యవర్గ సభ్యులు కోడూరు కేశవ, ఇమ్మానుయేలు, జాకోబ్ ,సనమల చెన్నయ్య, కలసపాడు మండల కార్యదర్శి సునీల్, బి కోడూరు మం డల కార్యదర్శి ప్రసాద్, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు పిరయ్య ఆర్ఎంపీ డాక్టర్ ప్రసాద్, శ్రీనివాసులు, విష్ణు, విశ్వాసము, జ్యోతి, షాహిదా, గుర్రమ్మ, వారి కుటుంబ సభ్యులు విజయ భాస్కర్ రెడ్డి, గురప్ప, అధిక సంఖ్యలో కార్య కర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు

బద్వేల్ అర్బన్ మార్చి 21 ప్రభాతవార్త :

నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య వెల్ఫేర్ అం డ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక కేక్ కట్ చేపించి జన్మదిన వేడుకలను నిర్వహించారు, ఈ కార్యక్ర మంలో పలువురు పాల్గొన్నారు,

## పోషణాభి పడాయివి శిక్షణ కార్యక్రమం

పెండ్లిమర్రి, మార్చి 21, ప్రభాతవార్త:



పోషన్ బి పడాయి బి కేంద్ర ప్రభుత్వ పథ కంపై అంగన్‌వాడీ వ ర్కర్లకు 3 రోజుల శిక్ష ణ కార్యక్రమం సి.కె. దిన్నె ప్రాజెక్టు పెండ్లి మర్రి మండలం నంది మండలం హైస్కూల్లో ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. మొదటి రోజు ఆదర్శిలా నవచేతన గు రించి చెప్పడం జరిగింది. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు అభివృద్ధి కా ర్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. 2వ రోజు శుక్రవారం పోషణ గురించి చెప్పడం జరిగింది. 3వ రోజు దివ్యాంగ పిల్లల్ని గుర్తించడం ఏ విధంగా ఎలా వారిని మనం గమనించాలి వారి పెరుగుదల గురించి తెలపడం జరుగుతుంది. ఈ కా ర్యక్రమానికి పెండ్లిమర్రి మండల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు తది తరులు పాల్గొన్నారు.

## ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రసంశాపత్రాలు అందిస్తున్న దృశ్యం

మదనపల్లె, మార్చి 21 ప్రభాతవార్త :

మదనపల్లె రూరల్ పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళా శాలలో విద్యార్థులు వివిధ పోటీల్లో ప్రతిభ కనపరచినట్లు శుక్రవారం కళాశాల డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ ఇంజనీరింగ్ ఈసిఈ విభాగానికి చెందిన విద్యార్థులు వివిధ ఇంటర్ కళాశాల నేషనల్ టెక్నికల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచా రన్నారు. అనంతరం ప్రతిభకనపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సతీష్‌బాబు, ఈసిఈ హెచ్ ఓడి డాక్టర్ కెవి.వరప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

## ఆక్రమ మైనింగ్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

పులివెందుల రూరల్, మార్చి 21, ప్రభాతవార్త :



వేముల మండలంలో జ రుగుతున్న ఆక్రమ మైనింగ్ తవ్వకాలపై దాడులు చేసి చర్యలు చేపట్టాలని నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇ న్‌ఛార్జ్ (సమన్వయ కర్త )మూలం రెడ్డి ధ్రువ కు మార్ రెడ్డి కోరారు. శుక్రవా రం వేముల మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఎం. గీత రాణిని కలిసి శాలువతో స త్కరించారు. అలాగే ఆక్రమ మైనింగ్ పై పిర్యాదు చేశారు. ఆక్రమ మైనింగ్ తవ్వకాలు వలన చాలా మంది కూలీల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ అనుమతితో ఉన్న వాటికి పనులు చేసుకోనే విధంగా చర్య లు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ అనుమతి లేకుండా మైనింగ్ చేయడం వల న గొర్రె కాపరులు కూడ నష్టం జరుగుతున్నదని చెప్పారు. అర్హత కలిగిన రైతులకు డికెటి పట్టాలను ఇవ్వాలని విన్నవించారు. స్పందించిన తహశీల్దారు గీతారాణి ప్రజలకు ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే డికెటి పట్టాలపై, అక్రమ మైనింగ్ తవ్వకాలపై కూడా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని తెలిపారని చెప్పారు. తహశీల్దార్ ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్, తదితరులు ఉన్నారు.

## ఎస్సీ హోదా కల్పించడం హర్షనీయం

బద్వేలు రూరల్, మార్చి 21, ప్రభాతవార్త :



బేడ బుడగ జంగాల కు ఎస్సి హోదా క ల్పించడం హర్షనీయ మని బిజెపి పట్టణ అ ధ్యక్షుడు ధర్మిశెట్టి వెం కటసుబ్బయ్య రాయల్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గౌరీ శం కర్ నగర్ లో బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి మరియు భారతీయ జనతా పార్టీ వారి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పా లాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బిజెపి పట్టణ అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య రాయల్ మాట్లాడుతు ఎస్సీ వర్గీకరణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్రము లోని కూటమి ప్రభుత్వము ఎస్సీ వర్గీకరణ ఆమోద బిల్లులో భాగంగా అత్యంత వెనుకబడిన బేడ బుడగ జంగాలను పరిగణలోకి తీసుకొని ముఖ్యంగా బు డగజంగాల వారికి ఎస్సీ హోదా కల్పిస్తూ ఆమోదం తెలిపడం సంతోషకరమ న్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు బేడ బుడగ జంగాల అధ్యక్షులు రేవల్ల నా రాయణ, ఉపాధ్యక్షుడు విభూది జమ్మయ్య, బి. శీను, బిజెపి సోషల్ మీడియా ఇంచార్జ్ సంజీవరెడ్డి, బద్వేల్ పట్టణ బిజెపి ఉపాధ్యక్షురాలు కటారు కిరణ్ కు మారి, బిజెపి నాయకులు కుప్పాల నరసింహులు, రేవల్ల రాజా ,పడిగే సుబ్బ రాయుడు, రేవల్ల శివయ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 21, ప్రభాత వార్త

లక్కిరెడ్డిపల్లె పోలీసు స్టేషన్లో కానిస్టేబుల్ పనిచేస్తున్న ముకుంద 34 శుక్ర వారం గుండె పోటుతో మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు ముకుంద కానిస్టేబుల్ శుక్రవారం ఉదయం లక్కిరెడ్డిపల్లె మసీదు వద్దకు విదులు నిర్వహి స్తుండగా ఛాతీలో నొప్పి రావడంతో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకొని రామాపురంలోని తన నివాసానికి వెళ్లి పిల్లలతో భార్యతో మాట్లాడి తనకు ఛాతీలో నొప్పిగా ఉందని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి తర లించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు బందువులు తెలి పారని ఎస్ఐ తెలిపారు మృతి నికీ భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు సిఐ కొండారెడ్డి ఎస్ఐ రవీంద్ర, స్టేషన్ సిబ్బంది సంతాపం తెలిపారు నేడు తమ సొంత గ్రామం వీరబల్లి మండలం వంగిమలలో ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## గాలివీడు పంచాయతీకి రూ.43.90 లక్షల ఆదాయం

గాలివీడు, మార్చి 21(ప్రభాతవార్త):

వారాంతపు సంత వేలంపాటలో గాలివీడు గ్రామ పంచాయతీకి రూ.43.90 లక్షలు ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులునాయక్, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీపీఓ మస్తాన్‌వలి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన వేలంపాటలో కూరగాయల సంత రూ.14.3 లక్షలకు కె.గంగాధర్‌నాయుడు, పశువుల సంత రూ.23.56 లక్షలకు కె.బాలప్పనాయు డు, బస్టాండ్ గేటు రూ.6.31 లక్షలకు కె.గంగాధర్‌నాయుడు దక్కించుకున్న ట్లుగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూష ణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు



గాలివీడు, మార్చి 21(ప్రభాతవార్త):

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీపీఓ మస్తాన్‌వలి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండు వద్ద వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డితో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేం దుకు స్వచ్ఛంధ సంస్థలు, స్థానిక ప్రజలు స్వచ్ఛంధంగా ముందుకొచ్చి చలివేం ద్రాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులునాయక్ పాల్గొన్నారు.

## విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కురబలకోట, మార్చి 21 ప్రభాతవార్త :

అంగళ్ళు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్‌నేషనల్ కా న్ఫరెన్స్ పోస్టర్లను కళాశాల ఛైర్మెన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరిం చారు. ఏప్రిల్ 11, 12వ తేదీల్లో విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో ఐసిఈటిఎం- 2025 మెగా ఇంటర్‌నెట్ ఇంటర్‌నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించుటకు సన్నద్ధం అవుతున్నట్లు కళాశాల డీన్ పబ్లిక్ రిలేషన్స్ పూజారి అంజప్ప తెలిపారు. ఐసిఈ టిఎం-2025 ఇంటర్‌నేషనల్ కాన్ఫరెన్స్ ఇంజనీరింగ్‌టెక్నాలజీ, మరి యు మేనేజ్‌మెంటు అంశాలపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఈకార్యక్రమా లకు వివిధ రాష్ట్రాల నుంచి అధ్యాపకులు, ప్రొఫెసర్లు, ఇండస్ట్రీ వ్యవస్థాపకులు పాల్గొంటారని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ జిఎల్.లీలా, డాక్టర్ ఎస్.అంజన్‌కు మార్, విభాగాదిపతులు, హెచ్ఓడిలు ఈ పోస్టర్ల ఆవిష్కరణలో పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు

కలికిరి, మార్చి 21, ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలైన ప్రతి ఒక్క అర్హునికి ఎన్టీఆర్ గృహ పథకంలో ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని మర్రి కుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ అన్నారు. శుక్రవారం మర్రికుం టపల్లె పంచాయతీలో మంజూరైన గృహ నిర్మాణ లబ్ధిదారుల సర్వేలో సర్పం చ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీఆర్వో సురేష్‌కుమార్‌రెడ్డి తన సిబ్బందితో గృహ నిర్మాణాల లబ్ధిదారుల స్థితిగతులు పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేయడం జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని వీఆర్వో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ మహేశ్వరీ పర్యవేక్ష ణలో హౌసింగ్ లబ్ధిదారుల సర్వే నిర్వహిస్తున్నట్లు వీఆర్వో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మర్రికుంటపల్లె పంచాయతీ పెద్దలు, టీడీపీ సీనియర్ నాయ కులు ఎం.ఆనందరెడ్డి, నాయకులు వెంకటపతి, వీఆర్ఏలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంకాలమ్మని దర్శించుకున్న తహసీల్దార్

కలికిరి, మార్చి 21, ప్రభాతవార్త:



కలికిరి-కలకడ రోడ్డు మార్గంలో గ్రామ దేవత గా వెలసిన శ్రీ అంకా లమ్మ దేవత అమ్మవా రిని శుక్రవారం కలికిరి మండల తహసీల్దార్ మ హేశ్వరీభాయ్, పత్తేగడ పంచాయతీ ఇన్‌ఛార్జి వీఆర్వో శిల్పకుమారి, కలికిరి పంచాయతీ సచివాలయం వీఆర్వో గౌరీలు సంయుక్తంగా అమ్మవారిని దర్శిం చుకొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన తహసీల్దారును ఆలయ ధర్మకర్తలు స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసా దాలను అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశా రు. ఆలయ ధర్మకర్తలు, సభ్యులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా తహసీల్దార్ మ హేశ్వరీభాయ్ తమ విధులను పూర్తి చేసుకొని సాయంత్రం అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలన్నదే తమ అభిమతమని ఈ విషయంగా అమ్మవారిని వేడుకున్నట్లు ఆమె తెలిపారు.

## పరీక్షా కేంద్రాలు తనిఖీ

దువ్వూరు, మార్చి 21, ప్రభాతవార్త:



దువ్వూరు, పుల్లారెడ్డి పేట హైస్కూల్‌లో జ రుగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాలను దు వ్వూరు తహసీల్దార్ అక్బ ర్ బాషా శుక్రవారం పరి శీలించారు. ఆయన పు ల్లారెడ్డి పేట జిల్లా పరిష త్ హైస్కూల్, కస్తూరిబా బాలికల పాఠశాల, దువ్వూరు హైస్కూల్‌లో ప రీక్షలు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. అలాగే పరీక్షా కేంద్రం వల్ల బ యట ఎవరూ లేకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రశాతంగా 10వ తరగతి పరీక్షలు విద్యార్థులకు రాసుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు పరీక్షల అధికా రులు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో ఉన్న వసతులను పరిశీలించారు.

## 5 మంది జూదరులు అరెస్ట్

దువ్వూరు, మార్చి 21, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో జూదం ఆడుతున్న 5మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 10100 రూపాయల నగదును స్వా ధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. గ్రామ పరిసరాల్లో జూ దం ఆడుతున్నారని సమాచారం రావడంతో ఈ దాడులు నిర్వహించామని గ్రామానికి సంబంధించిన 5మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిని త్వ రలో మైదుకూరు కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## బోరు బాగు చేయించిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు

కాశి నాయన, మార్చి 21, ప్రభాతవార్త



కాశినాయన మండలం మిద్దెల గ్రామంలో బోరు చెడిపోయి నీరు లేక నా నా అవస్థలు పడుతున్నా మని గ్రామస్తులు తెలి యజేశారు. ఈ మేరకు స్పందించిన గ్రామ స ర్పంచ్, పంచాయతీ కా ర్యదర్శి జగన్మోహన్ రెడ్డి స్పందించి బోరు బాగు చేయించడం జరిగింది. వేస వి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తక్షణమే గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు ముందుకు వచ్చిన సర్పంచ్ కు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## బ్రహ్మంగారి శాశ్వత కళ్యాణమునకు లక్ష రూపాయలు

బహ్మంగారిమఠం మార్చి 21, ప్రభాతవార్త



భూత భవిష్యత్తు వర్త మాన కాలజ్ఞానం సృష్టికర్త ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జగద్గురు శ్రీమద్విరాట్ పో తులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయ ప్రాంగణంలో జరుగు గో విందమాంబ సమేత శ్రీ వీ రబ్రహ్మేంద్ర స్వాముల వా రి మాస కల్యాణ మహోత్సవమునకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ పట్టణ వాస్తవ్యులు నల్లపాటి వినగా వెంకట శరత్ చంద్ర ధర్మపత్ని అరుణ కుమారి భాద్రపద శుద్ధ ద్వాదశి రోజున జరుగు కళ్యాణమునకు 100011 (అక్షరాల ఒక లక్ష పదకొండు రూపాయలు) విరాళమును చెల్లించినట్లు ఆలయ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలియజేశారు ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో జరుగు శాశ్విత కల్యాణమునకు ఎవరైనా భక్తులు విరాళం చెల్లించదలచిన వారు బ్యాంకు ద్వారా కానీ లేదా నేరుగా ఆలయ కార్యాలయం వద్ద గాని విరాళమును చెల్లించి తగు రసీదును పొందగలరని మరిన్ని వివరములకు 9502986023 నెంబరు ను సం ప్రదించగలరని తెలియపరిచారు ఈ కార్యక్రమంలో పూర్వపు 6వ తరం మఠాధిపతు కుమారులు నొస్సం వీరభద్రస్వామి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రం మంజూరు

గాలివీడు, మార్చి 21(ప్రభాతవార్త):

మండల కేంద్రంలో ఉచిత టైలరింగ్ శిక్షనా కేంద్రం ఏర్పాటు చేయనున్న ట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం గాలి వీడు-2 సచివాలయం సెంటర్‌ను పరిశీలించామని, 100 మంది అభ్యర్థు లను శిక్షణ నిమిత్తం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్(బీసీ కార్పొరేషన్) వారి ఆధ్వర్యంలో బీసీ మహిళలకు, కాపు (కాపు, తెలగ, బలిజ, ఒంటరి), అగ్రవర్ణాలలోని పేద(ఈడబ్ల్యుఎస్) కమ్మ, రెడ్డి, క్షత్రి య, ఈబీసీ, ఆర్య, వైశ్య, బ్రాహ్మణ వర్గాలకు చెందిన మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెండు నుండి మూడు మాసాల కాలవ్యవధిలో శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఉచితంగా టైలరింగ్ మిషన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. శిక్షణలో పాల్గొనే అర్హులైన మహిళలు ఈ నెల 22వ తేదీలోపు గ్రామ, వార్డు సచివాలయంలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధృవీకరణపత్రాలను సమర్పించా లన్నారు.

## రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు

జమ్మలమడుగు, మార్చి 21, ప్రభాతవార్త:

రంజాన్ సందర్భంగా జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండ లాల్లోని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డిలు ఏర్పాటు చేశారు. అనంతరం పల్గాడివీధిలోని గౌసియా మసీదులో ఇఫ్తార్ విందులో భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, ముస్లిం సోదరులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్కలు లేనిదే మానవ మనుగడ లేదు

వేంపల్లి, మార్చి 21, ప్రభాతవార్త :



మొక్కలు లేనిదే మా నవ మనుగడ లేదని ఏపీసిసి ముఖ్య అది కార ప్రతినిధి డాక్టర్ ఎ న్.తులసిరెడ్డి అన్నారు. ప్రపంచ అటవీ దినో త్సవం సందర్భంగా శు క్రవారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు మొక్కలు నాటే కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ (సమన్వయ కర్త)ధ్రువకుమార్ రెడ్డిలు మాట్లాడుతూ అడవులు, ,చెట్ల ప్రాముఖ్యతను ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పడమే ఈ రోజు ఉద్దేశం అని అన్నారు. చెట్లు మనిషికి అవసరమైన ప్రాణవాయువును ఉత్పత్తి చేస్తాయి. అదే సమయం లో మనుష్యులు వదిలే బొ గ్గు పులుసు వాయువును గ్రహిస్తాయని, ఎటు చూసినా జీవరాశులకు మేలు చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సు బ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామ కృష్ణ, వేముల మం డల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, ఉత్తన్, బద్రి, సాయి, విజయ్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

వేంపల్లి, మార్చి 21, ప్రభాతవార్త :



మారుతున్న జీవన విధానం ప్రపంచ వ్యా ప్తంగా వస్తున్న ,పారి శ్రామిక విప్లవం ,వైజ్ఞా నిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఫలితంగా ప్లాస్టిక్ వస్తు వుల ద్వారా కలిగే నష్టాలు వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలి యజేయటానికి కళాశాలలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్ఫలితాలు, వాటిని మరలా ఉపయోగించుట ద్వారా కలిగే లాభాలు మీద అవగాహన సద స్సు ఏర్పాటు చేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి యోగాంజ నేయులు తెలియజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కవి వరప్రసాద్ ప్లాస్టిక్ వ్యర్థా లను ఎలా మరల ఉపయోగించుకోవచ్చో విభిన్న పద్ధతుల ద్వారా వివరిస్తూ విద్యార్థిని, విద్యార్థులకు మార్గ నిర్దేశం చేశారు. వారు ఏర్పరచిన సాంస్కృతిక బృందం ద్వారా చెక్కభజన, కళా నృత్యాల ద్వారా ప్లాస్టిక్ వస్తువుల ద్వారా కలిగే అనర్థాలు, మన యొక్క బాధ్యతలను స్పష్టంగా తెలియజేశారు. ఈ సం దర్భంగా ప్రదర్శనలో పాల్గొన్న బాల బాలికలకు ఎన్ఎస్ఎస్ యూనిట్స్ తరపు న బహుమతులు ప్రధానం చేయడం జరిగినది .ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎం ఓబుల్ రెడ్డి ,డాక్టర్ సి మల్లేశ్వరమ్మ మరియు అధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యపై సత్వరమే పరిష్కారం

వేంపల్లి, మార్చి 21, ప్రభాతవార్త :



గత వారం రోజులుగా వేంపల్లి పట్టణంలోని ప లు ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో వేంపల్లెకి చెందిన తెలు గుదేశం నేతలు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చే శారు. అయితే శాశ్వత పరిష్కార కోసం తాగునీటి సమస్యపై ఇంఛార్జి బిటెక్ రవి దృష్టికి ఆ పార్టీ నేతలు తీసుకెళ్లారు. దీంతో స్పం దించిన బిటెక్ రవి తో పాటు వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి లు అందుకు తగిన ఏర్పాట్లకు కృషి చేశారు. నీటి శాతం అడుగంటిన చోట కొ త్త బోర్ల ఏర్పాటుకు ఆదేశించారు. సిమెంట్ రోడ్లకు మంజూరైన నిధులను రద్దు చేసి, ఆ నిధుల బదులుగా తాగునీటికి అవసరమైన కొత్త బోర్లు ఏర్పాటు చేశా రు. బోర్లు, మోటార్లు, పైపులైన్లు ఏర్పాటుకు డిఎంఎఫ్ఓ నిధుల కింద మం జూరైన వీటిని టిడిపి నేతలు రామమునిరెడ్డి, షబ్బీర్, వీరభద్ర, వేమాకుమార్ లు పూజలు నిర్వహించి, కొత్త బోర్లను ఏర్పాటు చేశారు. నాయకులు నాగ భూషణం, షరీఫ్, మహమ్మద్, భాస్కర్, గంగాధర్ రెడ్డి, వెంకటేష్, శివ, వెంక టపతి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంధుల ఆశ్రమానికి ఎస్ఎంఎస్ చేయూత

పులివెందుల,మార్చి21 ,ప్రభాతవార్త :



పట్టణంలోని శ్రీనివాస హాల్ సమీపంలో ఉన్న వీ రనారాయణస్వామి అం ధుల ఆశ్రమానికి శుక్రవా రం ఎస్ఎంఎస్ చేయూ తను అందించింది. ఎస్ ఎంఎస్ కంపెనీ ఆధ్వ ర్యంలో ఎస్ఎంఎస్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఖలీల్ సౌదాగర్ ఆధ్వర్యంలో ఆశ్రమానికి మంచాలు బి య్యం ప్యాకెట్లు, దుప్పట్లు చీరలు,టీ షర్టు, ప్యాంట్లు వికలాంగులకు కావలసిన ఇతర సామాగ్రి, ఆశ్రమంలో వృద్ధులు కూర్చునేందుకు బల్లలు, సుమారు రెం డు లక్షల రూపాయల విలువ చేసే వస్తువులను ఆశ్రమానికి అందించారు. ఈ సందర్భంగా చీఫ్ విజిలెన్స్ అధికారి ఖలీల్ సౌధాగర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఎస్ఎంఎస్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాలకు అనాధ ఆశ్రమాలకు కావాల్సిన సా మగ్రి, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామాగ్రిని అం దిస్తున్నామన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవ ర్చుకొని తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలన్నారు. స మాజంలో ఎంతోమంది వికలాంగులు వృద్ధులు కంటి చూపులేని మహిళలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ఎస్ఎంఎస్ కంపెనీ ఎల్లప్పుడూ ముందుం టుందన్నారు. ఈ కార్యక్రమం లో అర్బన్ సీఐ నరసింహులు, ఎస్ఎంఎస్ కంపెనీ జి ఎం హెచ్ ఆర్ నిశికాంత్ బోరే, నరేష్ నాగ పూ రే, డిప్యూటీ మేనేజర్ పవన్ కుమార్ రెడ్డి సీనియర్ ఎగ్జిక్యూటివ్ సురేష్ కుమార్ రెడ్డి, అంకాలమ్మ ఆలయ చైర్మన్ ప్రసాద్, సీని యర్ పాత్రికేయుడు రంగనాయకు లు, ఆశ్రమం నిర్వాహకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి

దువ్వూరు, మార్చి 21, ప్రభాతవార్త:



మండల పరిధిలోని కడప-కర్నూల్ జాతీ య రహదారిపై ఇడమడక తనిఖీ కేంద్రం వద్ద శుక్రవారం తెల్లవారు జాము జరిగిన రోడ్డు ప్రమాదంలో బండి నారాయణ(50) అనే ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. వివ రాలు ఇలా ఉన్నాయి..మైదుకూరు మండలం కేశలింగాయి పల్లె గ్రామానికి చెం దిన బండి నారాయణ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఈ నెల 1వ తేది నుండి ఇడమడక తనిఖీ కేంద్రం వద్ద విధుల్లో ఉన్నాడు. అందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున వాహణాలు తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుం డి తిరుపతి పోవు కావేరి ట్రావెల్స్ బస్సు అతి వేగంగా ఢీ కొంది. దీంతో నారా యణకు తీవ్ర గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం చాగలమర్రి లోని కేరళ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కొరకు కర్నూల్‌కు తీసుకువెళ్తుండగా మరణించాడు. నారాయణ భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. మృ తదేహాన్ని పోస్టుమార్టమ నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

## బార్ ఎన్నికల అధికారిగా పి.జయరామిరెడ్డి

కడప లీగల్, మార్చి 21, ప్రభాతవార్త:

కడప న్యాయవాదుల సంఘం(బార్) 25-26సంవత్సరానికి గాను జరగను న్న న్యాయవాదుల సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది పి.జయరామిరెడ్డిని ఎన్నుకున్నట్లు ప్రస్తుత బార్ ప్రెసి డెంట్ గుర్రప్పనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఎన్నికల అధికా రిగా సీనియర్ న్యాయవాది జయరామిరెడ్డి సహాయ ఎన్నికల అధికారులుగా న్యాయవాదులు పీడీ రాంబాబు, సీహెచ్ మో సెస్ జాస్వా, బాలాజీ, గురునాథ్‌లను ఎంపిక చేసినట్లు బార్ అధ్యక్షుడు గుర్ర ప్ప నాయుడు తెలిపారు.

# నడిరోడ్డుపై న్యాయం కోసం నవీన్ మృతదేహంతో ధర్నా

తంబళ్లపల్లె మార్చి 21 (ప్రభాతవార్త):

పుడమి కిసాన్ మార్ట్ లో అకౌంటెంట్గా పని చేస్తున్న నవీన్ కుమార్పై ఆ సంస్థ సిబ్బంది 23 లక్షల తప్పుడు లెక్కలు మోపి అపాదించడంతో అవేదనతో నవీన్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తెలిసిన విషయమే. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మదనపల్లి నుండి నవీన్ మృతదేహాన్ని తంబళ్లపల్లెకు తరలించగా అప్పటికే పుడమి కిసాన్ మార్ట్ వద్ద వందలాది మంది ఆర్థగింది రోడ్డుపై నవీన్ మృతదేహంతో ధర్నాకు దిగారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా పుడమి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, యాజమాన్యం దిగి రావాలని, నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని నిరసనకు దిగారు. అనంతరం క్రాస్‌రోడ్ లో షామియానా ఏర్పాటు చేసి ధర్నా తీవ్రతరం చేయడంతో మదనపల్లి రహదారి రెండు కిలోమీటర్ల దూరం వాహనాలు నిలిచి పోయి. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హుటాహుటిన ఎస్సై లోకేష్ రెడ్డి తన సిబ్బందితో హాజరై ఆందోళనకారులకు ఎంత నచ్చ చెప్పినా జనాలు మా బిడ్డకు న్యాయం జరిగేంత వరకు నవీన్ మృతదేహం విరమించేది లేదని తెగేసి చెప్పారు. విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ జయచంద్ర రెడ్డి హుటాహుటిన తంబళ్లపల్లెకు చేరుకుని నవీన్ మృతి పై తీవ్ర సంతాపం వ్యక్తం చేసి ఆ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఓదార్చి నవీన్ మృతికి కారణమైన పుడమి యాజమాన్యంపై కఠినంగా వ్యవహరించాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ కు ఫోన్ ద్వారా మరియు ఎస్సై లోకేష్ రెడ్డి లకు సూచించారు. నవీన్ కుటుంబానికి న్యాయం జరగకపోతే ఇక్కడ కాదు మొలకలచెరువు హైవే రోడ్డుపై నేనే బైఠాయించి ఆ కుటుంబానికి అండగా నిలబడతానని హెచ్చరించారు. నవీన్ కుటుంబానికి నేను పెద్దన్నయ్యగా నిలిచి అన్ని విధాల ఆదుకుంటానని దీంతో పాటు పార్టీపరంగా ఆ కుటుంబానికి సహాయ సహకారాలు అందించడానికి ముందు ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గంలో నా తెలుగుదేశం కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం ఏ త్యాగానికైనా సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, క్లస్టర్ ఇంచార్జిలు బేరి శ్రీనివాసులు, బి.ఎం.ఆర్, మాజీ ఎంపీపీ నాందీ రెడ్డప్ప, మాజీ జెడ్పిటిసి రామచంద్ర, కూటమి నాయకులు, వందలాదిగా ప్రజలు పాల్గొన్నారు.


నవీన్ మృతదేహంతో ధర్నాకు దిగిన జన సందోహం

# మందుల వాడకంపై అవగాహన

పీలేరు, మార్చి 21 ప్రభాతవార్త:

వ్యవసాయ, ఉద్యాన వన పంటలలో చీడపీడ నివారణకు మందుల వాడకంపై అవగాహన ఉండాలని వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కార్తీక్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాలంవారిపల్లె ఎస్సీ కాలనీలో రైతులకు సస్యరక్షణ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. పంటలకు మందులు పిచికారి చేసేటప్పుడు స్ప్రేయర్ వినియోగంపై మెలకువలు పాటించాలన్నారు. పురుగులమందులు పిచికారి చేసేటప్పుడు కళ్లజోడు, మాస్కులు చేతి తొడుగులు, ధరించి పిచికారి చేయాలని ఆయన సూచించారు. మందులు పిచికారి సమయంలో ముందస్తు జాగ్రత్తలు పాటించకుంటే అనేక అనార్థాలు దారి తీస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమాదేవి, వ్యవసాయ సిబ్బంది జ్యోత్స్న, జహీర్ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కార్తీక్ రెడ్డి

# బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా హనుమంతునాయుడు


పచ్చి హనుమంత నాయుడిని అభినందిస్తున్న న్యాయవాదులు

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది పచ్చా హనుమంతునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శుక్రవారం ఎన్నికల అధికారి పి సురేష్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారి గోవర్ధన్‌రెడ్డిలు ప్రకటించారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా జాఫర్ భాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజంపేట బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షులుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. నూతన అధ్యక్షులు హనుమంతునాయుడు మాట్లాడుతూ, ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్క న్యాయవాదికి కృతజ్ఞతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొండూరు శరత్‌కుమార్ రాజు, నాసరుద్దీన్, గడికోట రామచంద్రయ్య, రామచంద్రరాజు, నరికిరి రెడ్డయ్య, శంకర్‌నాయుడు, కాశీ విశ్వనాథ్, సుందర్రామ రాజు,వి. వి. రమణ, ప్రభాకర్‌రావు, కత్తి సుబ్బారాయుడు, శ్రీకాంత్, షమీ ఉల్లాఖాన్, కెఎంఎల్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ తీర్మానంతో సమన్యాయం



ప్రొద్దుటూరు మార్చి 21 ప్రభాతవార్త

సుప్రీంకోర్టు ఆదేశాలతో ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో తీర్మానం చేయడంతో ఎస్సీలు అందరికీ సమన్యాయం జరిగిందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాదిగ అన్నారు. శుక్రవారం ఎస్సీ వర్గీకరణకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో తీర్మానం చేసిన నేపథ్యంలో తన కార్యాలయంలో ఆయనతోపాటు ఎస్సీ సోదరులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణస్వామి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాదిగను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ గత 30 ఏళ్ల ఉద్యమ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ జరిగినట్లు ఆయన ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిన ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎస్సీ వర్గీకరణ తీర్మానంతో ఎస్సీలందరికీ న్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు ఎస్సీ మాదిగ ఉపకులాలకు 6.5 ఎస్సీ మాల ఉప కులాలకు 7.5 ఇతరులకు ఒక శాతం కేటాయిస్తూ తీర్మానం చేయడంతో ఎవరికి నష్టం జరగదన్నారు. గత 30 ఏళ్లలో ఎస్సీ వర్గీకరణ ఎస్సీ వర్గీకరణ ను డిమాండ్ చేస్తూ ఎన్నో ఉద్యమాలు చేసి అసువులు బాసిన అమరులకు ఆయన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణస్వామి మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేశ్వరి జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులుగా నాగేంద్ర

ప్రొద్దుటూరు మార్చి 21 ప్రభాతవార్త



ఏపీ ఎమ్మార్పీఎస్ కడప జిల్లా ఉపాధ్యక్షులుగా నాగేంద్ర ను నియమించినట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా నియమిస్తూ జారీచేసిన ధ్రువపత్రాన్ని ఆయన నాగేంద్రకు అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టామని మాదిగల అభ్యున్నతి కోసం కృషి చేశామన్నారు. నాగేంద్ర మాట్లాడుతూ ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లాలో బలోపేతం చేస్తూ మాదిగ ఉపకులాలకు అండగా ఉంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణస్వామి మహిళా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల తనిఖీ

ఒంటిమిట్ట మార్చి 21 ప్రభాతవార్త



ఒంటిమిట్ట గ్రామ పంచాయతి నందు శుక్రవారం ఎంపీడీవో కుళ్ళాయి బాబు మరియు ఉపాధి సిబ్బంది కాలువ పూడికతీత పనులను తనిఖీ చేశారు. ఇందులో ముఖ్యంగా ఉపాధి కూలీలతో మాట్లాడుతూ, రోజు కూలీ మరియు ఎండలకు తీసుకోవలసిన జాగ్రత్తలు, పనివేళలు వంటి విషయాలను వారికి క్షుణ్ణంగా తెలియజేయడమైనది. కొత్త మాధవరం లోస్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు తడి చెత్త పొడి చెత్త కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ఏపీవోశివ శంకర్ రెడ్డి, ఈవో పీఆర్డి కెఆర్ ఎంప్రసాద్ పంచాయతీకార్యదర్శి సుధాకర్ టిఏ శ్రీవాణి ఎఫ్ ఎపవన్ కుమార్ పాల్గొన్నారు.

# ధరఖాస్తులు ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె; మార్చి 21, ప్రభాతవార్త

కేజీబీవి పాఠశాలలో 2025,26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు పూర్తి చేసిన ధరఖాస్తులను పాఠశాలలో అప్పగించాలన్నారు. అనాధ పిల్లలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్ పిల్లలు, పేద విద్యార్థులు,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ బిపి ఎల్ బాలికలు ధరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. ధరఖాస్తులు ఆన్లైన్లో ధరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# నోటి శుభ్రతతోనే ఆరోగ్యం

లక్కిరెడ్డిపల్లి; మార్చి 21, ప్రభాతవార్త..

నోటి ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపర్డెంట్ డాక్టర్ నీలోఫర్ బేగం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు ప్రపంచ నోటి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిలోఫర్ బేగం మాట్లాడుతూ చిన్నతనం నుంచే తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నోటి పరిశుభ్రత గురించి తెలియచేయాలి. లేకుంటే దంత గుండె వ్యాధులతో పాటు మతి మరుపు కూడా వచ్చే ప్రమాదముందన్నారు. రోజూ గోరువెచ్చటి నీటితో పుక్కిలించాలి. ఉదయం రాత్రి దంతాలను శుభ్రం చేసుకోవాలి. నాలుకను ప్రతిరోజూ శుభ్రం చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ధరణి కుమార్, జీవన్ కుమార్, మహేష్, భరత్, నిసార్ అహమ్మద్, రెడ్డి కీర్తి, సులోచన , రెడ్డి కృష్ణ, ప్రసాద్, దీపికా తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ నీలోఫర్ బేగం

# వెలుగు సంస్థలో డౌన్ సిండ్రోమ్ డే కార్యక్రమం

మదనపల్లె, మార్చి 21 ప్రభాతవార్త :


చిన్నారులతో వెలుగు సిబ్బంది

పట్టణంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు స్వచ్ఛంద సేవా సంస్థలో శుక్రవారం డౌన్ సిండ్రోమ్ డే కార్యక్రమం వెలుగు చిన్నారుల ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. డౌన్ సిండ్రోమ్‌ల గురించి చిన్నారి జ్యోతి కిరణ్ తల్లి రాధమ్మ అంగవైకల్యం యొక్క లక్షణాలను, రక్త పరీక్షలను, నిర్మూళన జాగ్రత్తలపై వివరించారు. డౌన్ సిండ్రోమ్‌గల చిన్నారులు సూర్యనమస్కారాలు చేసి, యోగవిన్యాసాలు చూసి పలువురు ఆనందించారు. పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శనలు చేసి అందరిని అలరించారు. చిన్నారులు అందరూ కలసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, యోగ మాస్టర్ అనిత, వార్డెన్ స్వీటి, ఈసి మెంబర్ సుజాత, వెలుగు సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

# ఉప్పలపాడులో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

జమ్మలమడుగు, మార్చి 21, ప్రభాతవార్త:



కలెక్టర్ ఆదేశాల మేరకు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉప్పలపాడు గ్రామ పంచాయతీ నందు ఎంపీడీవో సయ్యద్ ఉన్నిసా ఆధ్వర్యంలో సర్పంచ్ ఈవో పీఆర్ అండ్ ఆర్డీ మరియు పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరిగి డస్ట్ బిన్‌లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ వ్యవస్థను మోసం చేయొద్దు

జమ్మలమడుగు, మార్చి 21, ప్రభాతవార్త:



జమ్మలమడుగు ఆర్టీసీ ఆవరణలో కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వం దేశ వ్యాప్త ఆర్టీసీ వ్యవస్థపై అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మార్చి 24న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కరపత్రాలు, బుక్‌లెట్లు పంచారు. అనంతరం జమ్మలమడుగు సీఐటీయూ కార్యదర్శి దాసరి విజయ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో విద్యుత్తు బస్సులను నిర్వహించుకునే అవకాశం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలన్నారు. దేశంలో వివిధ ఆర్టీసీల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగ కార్మికులు చలో ఢిల్లీ ఎనిరసన కార్యక్రమానికి హాజరవుతున్నారన్నారు. 2029 నాటికి మొత్తం ఆర్టీసీలో విద్యుత్తు బస్సులతో నింపాలని సుస్థిర విద్యుత్తు వాహనాల పాలసీ-4లో లక్ష్యంగా పెట్టారు. ఇది ఏపీఎస్ ఆర్టీసీకి తీవ్ర నష్టం అన్నారు. మొత్తం మీద దేశ రాష్ట్రాల వ్యాప్తంగా ఈ నిర్ణయాలతో ఆర్టీసీని తుద ముట్టించడమేనన్నారు. ఇలా అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల ఉద్యోగులు రోడ్డున పడతారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈనెల 24న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నరేంద్ర, మహమ్మద్ వలీ, బాషా తదితరులు పాల్గొన్నారు.

# యువకునికి తీవ్ర గాయలు

చిన్నమండెం ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:

మండలంలోని దేవగుడిపల్లి గ్రామం రాయచోటి మదనపల్లి ప్రదాన రహదారిలో దేవగుడిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళితే పెద్దమండేం మండలం తురకపల్లి గ్రామం వెలిగల్లుకు చెందిన కె.మధుకర్ రెడ్డి అను యువకుడు రాయచోటికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో మదనపల్లె వైపు వెళుతుండగా మదనపల్లి వైపు నుండి రాయచోటి వైపు బొగ్గు లోడుతో వెళ్లుతున్న లారి ఢీకొంది .ఈ సంఘటనలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. కాలు విరిగింది.వెంటనే అతన్ని అంబులెన్స్ లో రాయచోటీ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.సంఘటనా స్థలాని యస్ ఐ సుదాకర్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కారు ప్రమాదంలో చిన్నారికి గాయాలు

ముద్దనూరు ,మార్చి 21, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఉప్పులూరు గ్రామంలో శుక్రవారం నాడు ఆరు సంవత్సరాల కీర్తన ను ప్రమాదవశాత్తు కారు ఢీకొని తీవ్ర గాయాల అయినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల వివరాల మేరకు ఉప్పలూరు గ్రామ సచివాలయ సమీపంలోనీ ఓ కుటుంబం శుభ కార్యక్రమం అనంతరం చిన్నారి కీర్తన రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు కారు ఢీకొని తలకు బలమైన గాయాల అయ్యి చెవి నుంచి రక్తస్రావం అయినట్లు స్థానికులు వివరించారు. చిన్నారిని మెరుగైన వైద్యం కొరకు కర్నూలుకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. చిన్నారి కుటుంబంలో ఇదివరకే తండ్రి లక్ష్మయ్య పాముకాటుకు గురైమ రణించి సంవత్సరం గడవక మునుపే ఈ ఘటన చోటు చేసుకోవడంతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులలో విషాదఛాయలు అమలుకున్నాయి.

# మదనపల్లిలో భారీగా పోలీసు బదిలీలు

మదనపల్లి క్రైమ్ మార్చి 21 ప్రభాతవార్త.

మదనపల్లి పట్టణంలోని మూడు సర్కిల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బందిని బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. మూడు స్టేషన్ల పరిధిలో ఒకేసారి 57 మంది సిబ్బందిని బదిలీ చేయటం చర్చనీయాంశం అయింది. మదనపల్లి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఏఎస్ఐ, ఎనిమిది మంది హెడ్ కానిస్టేబుల్, 19 మంది కానిస్టేబుళ్లు వివిధ ప్రాంతాలకు బదిలీ కాగా, వారి స్థానంలో ఇద్దరు ఏఎస్ఐలు, 8 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 20 మంది కానిస్టేబుళ్లు రావడం జరిగింది. తాలూకా స్టేషన్ నుంచి ఒక ఏఎస్ ఐ, 6 మంది హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుల్ లో బదిలీ కాగా, ఇద్దరు ఏఎస్ఐలు, ఐదు మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఐదు మంది కానిస్టేబులు రావడం జరిగింది. అలాగే ఓటు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి మొత్తం 18 మంది బదిలీ కాగా, వారి స్థానంలో 20 మంది శ్రేణికి రావడం జరిగింది. ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున బదిలీ జరగడం స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది.

# అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

## ఉద్యోగాలకు 43 మంది విద్యార్థులు ఎంపిక



రాజంపేట అర్బన్, మార్చి 21 ప్రభాతవార్త:

స్తానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన సైంటిఫిక్ ఎల్వీనా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి స్వర్ణలత తెలిపారు.ఈ క్యాంపస్ నియామకాలకు సంబంధించి 80 మంది విద్యార్థులకు మొదటి దశలో రాత పరీక్ష నిర్వహించారు. అందులో అరవై మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి బృంద చర్చ నిర్వహించి అందులో ఎంపికైన వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించారు. చివరగా అన్ని రౌండ్లలో కలిపి 43 మంది విద్యార్థులు అర్హత సాధించి క్యాంపస్ నియామకాలకు ఈ ఎంపికైనట్లు తెలిపారు కళాశాల నియామక సమన్వయకర్త యు.నరసింహులు, డాక్టర్ ఎం హంజా బేగ్, కళాశాల సిబ్బంది ఈ నియామక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నియామకాలలో ఉద్యోగాన్ని సంపాదించిన వారికి ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఉద్యోగంతో సుమారు మూడు లక్షల ప్యాకేజీ సంవత్సరానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నియామకాలలో బి ఫార్మసీ, ఫార్మా డీ విద్యార్థులు పాల్గొన్నారు. త్వరగా క్యాంపస్ ఇంటర్లలో ఎంపికైన విద్యార్థులను ఏఐటిఎస్ వైస్ చైర్మన్ చొప్ప ఎల్లారెడ్డి అభినందించారు ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునేటప్పుడే ఉద్యోగం రావడం అదృష్టం అన్నారు. అందుకు అన్నమాచార్య విద్యాసంస్థలు ఎప్పుడూ చొరవ చూపి క్యాంపస్ నియామకాల్లో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని పనిచేస్తుందని పేర్కొన్నారు.

# పీలేరులో 8 మంది పోలీసులు బదిలీ

పీలేరు, మార్చి 21 ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లాలో గురువారం అర్ధరాత్రి జరిగిన పోలీసులబదిలీలో భాగంగా అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశానుసారం పీలేరు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు, కానిస్టేబుల్ 8 మందిని సీఐ యుగంధర్ తెలిపారు. బదిలీ అయిన సిబ్బంది కేటాయించిన స్థలాలకు వెళ్లి విధులలో చేరాలని ఉత్తర్వులలో పేర్కొన్నట్లు తెలిపారు.

# ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించండి

## పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పీలేరు మార్చి 21 ప్రభాతవార్త :

వైద్య ఆరోగ్య శాఖ కేడర్ల ఖాళీలను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. అహరూన్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ లు వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ బి. రామ గిడ్డయ్యను కోరారు. శుక్రవారం వారు కడపలో వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులను కలిసి కడప జోన్ పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పనలో ఆలస్యమవుతోందని అన్నారు. అన్ని క్యాడర్ల సీనియారిటీ జాబితాలను వెంటనే విడుదల చేసి అభ్యంతరాలను తెలియచేసే అవకాశం ఇవ్వాలని, అందుకు ముందస్తుగా జాబితాలను విడుదల చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి గుర్తింపు సంఘాలతో సమావేశం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి బాల కృష్ణ, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు లక్ష్మి నారాయణ, కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, సంపత్ కుమార్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు షేక్ బాబా సాహెబ్, కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, బాషా, వీరేంద్ర, రామసుబ్బారెడ్డి, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

# మన సేవలను ప్రజలు గుర్తించుకోవాలి

గాలివీడు, మార్చి 21(ప్రభాతవార్త):

ప్రభుత్వ ఉద్యోగాలలో పదవీవిరమణలు, బదిలీలు సర్వసాధారణమే అయినా ఎన్ని రోజులు విధులు నిర్వహించామని కాకుండా మన సేవలు ప్రజలకు గుర్తిండిపోయే విధంగా పనిచేయాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. శుక్రవారం బదిలీపై వెళ్తున్న పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ పివి రమణ, కానిస్టేబుళ్ల నాగేంద్ర, పురుషోత్తం, రామాంజులు, రమేష్‌బాబు, మదన్‌మోహన్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బదిలీపై ఎక్కడికి వెళ్లినా డిపార్ట్‌మెంట్‌కు మంచిపేరు తీసుకువచ్చేలా పనిచేయాలని సూచించారు.

**ఏడుగురు కొత్త సిబ్బంది గాలివీడు స్టేషన్‌కు:** జిల్లా వ్యాప్తంగా జరిగిన బదిలీలలో గాలివీడు పోలీస్‌స్టేషన్‌కు ఏఎస్ఐలు ఎస్.వెంకటేశ్వర్లు, కె.వేణుగోపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సుబ్రమణ్యం, కానిస్టేబుళ్ల పి.నరేష్, జి.నరేష్, ఆరీఫుల్లా, ప్రభాకర్‌లు బదిలీపై వస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**జాతర్లలో చాందినీబండ్లకు అనుమతి తప్పనిసరి:** మండల వ్యాప్తంగా జాతర్లు జరిగే ప్రదేశాల్లో చాందినీబండ్లు ఏర్పాటు చేయువారు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్లో అనుమతులు తీసుకోవాలన్నారు. ఆలయ ధర్మకర్తలు కూడా పోలీస్‌స్టేషన్లో సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతేగాక జాతర పేరుతో అశ్లీల నృత్యాలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# దారిని ఇప్పించాలని ధర్నా




రైల్వేకోడూరు, అర్బన్, మార్చ్ 21, ప్రభాతవార్త.

మండలం ఓబనపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో రాజకీయ కారణాలతో అగ్రవర్ణ భూస్వామి దారిని ఆక్రమించి, ఇనుప కంచి వేసిన దాన్ని, తొలగించి, దారి చూపాలని, హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు, అమలు చేయాలని శుక్రవారం, కోడూరు, ఎమ్మార్వో ఆఫీస్ వద్ద, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ఉన్న దారి 2016లో మూసివేసారని, అప్పటి ఎమ్మార్వో, సర్వేరు సర్వే చేసి, దారి ఉందని, వారికి నోటీసు లువుగా, హైకోర్టు ద్వారా స్టే తెచ్చారని, ఎనిమిది సంవత్సరాల తర్వాత, ప్రస్తుతం హైకోర్టు ఆర్డర్ ప్రకారం స్టే రద్దుచేసి, నాలుగు వారాల్లోగా దారి చూపమని, తాసిల్దారు, రెవెన్యూ అధికారులకు ఆదేశించారన్నారు. కానీ రెవెన్యూ అధికారులు కోర్టు ఆదేశాలను, లెక్కచేయకుండా, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని, పేద రైతులకి న్యాయం చేయాలని కోరారు. ఎమ్మార్వో, సూపర్డెంట్, ఆఫీసులో లేని కారణంగా, సీనియర్ అసిస్టెంట్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు, సుభాన్ భాష, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, నాయకులు, లక్కిరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్, ఓబిలి పెంచలయ్య, సిపిఎం నాయకులు, బొజ్జ శివయ్య, సిఐటియు, మండల సహాయ కార్యదర్శి, నగిరిపాటి ఆనంద్, సిఐటియు, ఓబులవారిపల్లి మండలం, కార్యదర్శి, నాగిపోగు, పెంచలయ్య, కేశవులు, వ్యవసాయ కార్మిక సంఘం, నాయకులు, రమణయ్య, నారాయణ, గురవయ్య, చలపతి, శ్రీను, చిన్న నాగమ్మ, నూర్జహాన్, చెంగమ్మ పాల్గొన్నారు.

# పోషణాభి పడాయి బి శిక్షణ తరగతులు



పెద్దమండెం మార్చి 21 ప్రభాతవార్త

మండలంలోని కల్చర్ల జూనియర్ కళాశాలలో 20 నుండి మూడు రోజులపాటు పోషణభి పడాయిబి రక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ నజియా బేగం అన్నారు సిడిపిఓ నాగవేణి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని వీటి ద్వారా బాల్య ఆరంభ దశ విద్య అనేది జీవితానికి ముఖ్యమని అన్నారు నవచేతన ఆదర్శ అనే కొత్త పాఠ్యపుస్తకాలను రాణికల్ ద్వారా మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు ఎర్లీ స్టిములేషన్ కలిగించడం పిల్లల్లో బాల్య ఆరంభ సంరక్షణ విద్య గురించి 20 20 యొక్క లక్షణాలను నెరవేర్చుకోవాలని తెలిపారు దీని ద్వారా సమగ్ర అభివృద్ధి నైపుణ్యం కలుగుతుందన్నారు పిల్లల ఆరోగ్యం ఎదుగుదల ముఖ్యమని వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత మన అందరి దేనిని తెలిపారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కళావతి ఐసిడిఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బదిలీపై వెళుతున్న కానిస్టేబుల్లకు సన్మానం

రామసముద్రం మార్చి 21 ప్రభాతవార్త



మండల పోలీస్ స్టేషన్ నందు నాలుగు ఐదు సంవత్సరాలు మండలకేంద్రంలో కానిస్టేబుళ్ల గా విధులు నిర్వహించి బదిలీ అయిన కానిస్టేబుల్స్ చంద్రరాజు, శాంతకుమారి, హరిప్రసాద్ రెడ్డి,పార్తసారధిలను ఎస్సై రవి కుమార్ స్థానిక సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కొత్త ప్రాంతంలో కూడా మంచి గుర్తింపు సంపాదించాలని ఆకాంక్షించారు. మండలంలో చేసిన సేవలకు గుర్తింపుగా శాలువాతో ఘనంగా సన్మానం చేశారు .ఈ సన్మానం కార్యక్రమం లో పాల్గొన్నా ఎస్సై రవికుమార్, ఏఎస్సై హిమాచలపతి, లోకేష్,సురేంద్ర శ్రేయోభిలాసులు పాల్గొన్నారు.

# ఈతతో సేద తీరుతున్న యువత

రామసముద్రం మార్చి 21 ప్రభాతవార్త



మండలంలో ఎండలు ఎక్కువ అవడంతో, పెద్దలు, పిల్లలు బావులు, చెరువు, చిన్న చిన్న కుంట లు దగ్గరకి వెళ్లి ఈతతో సేదతీర్చుకుంటున్నారు. గత 10రోజులుగా ఎండ వేడి అధికం కావడంతో పెద్దలు, పిల్లలుబయట వచ్చేందుకు భయందోళన చెందుతున్నారు మండలం లో 36నుంచి 38సెంటిగ్రేడ్ లఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ఎండలు ఎక్కువ అవడంతో మండల ప్రజలు రోడ్లమీద తిరిగేందు భయపడుతున్నారు. మిట్ట మధ్యాహ్నం సమయం లో మండలకేంద్రం లో ని రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనపడుతున్నాయి. వేసవి సెలవలు కావడంతో విద్యార్థులు కూడ ఈతకొడుతూ సేద తీరుతున్నారు. మే నెలాఖరు వరకు ఎండలు ఇలానే ఉంటాయని పలువురు చెబుతున్నారు,

# ఆర్అండ్‌బి ఆక్రమణలో ఉన్న వాటిని తొలగిస్తాం

మైదుకూరు, మార్చి 21, ప్రభాతవార్త:



పట్టణంలో ప్రధాన రహదారుల వెంట ఆర్అండ్‌బి ఆక్రమణలు జరిగి ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అంతేకాకుండా ప్రజలకు పాదచారులకు ఇబ్బందులు కలగ చేస్తున్నారని రహదారిపైనే వ్యాపారస్తులు ఆక్రమణలు గురి చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారని వారిపై తొందర్లోనే నోటీసులు జారీచేసి తగు చర్యలు తీసుకుంటామని మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి మీడియాకు తెలియజేశారు. కార్యచరణలో భాగంగా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చి సచివాలయ పరిధిలోని ఆక్రమణలను గుర్తించి చర్యలతో పాటు ఫైన్ ఉంటుందని తెలియజేశారు.

### 22న జిల్లావ్యాప్తంగా ఫారంపాండు

# పనులను విస్తృతంగా ప్రారంభించాలి



**రాయచోటి మార్చి 21 ప్రభాతవార్త**

ఈ నెల 22న "ప్రపంచ జల దినోత్సవాన్ని" పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఫారం పాండు పనులను విస్తృతంగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని సచివాలయం నుంచి ప్రపంచ జల దినోత్సవం, పల్లె పండుగ పనుల ప్రగతిపై జిల్లా కలెక్టర్లు, పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటి సంరక్షణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా 22న శనివారం జిల్లా వ్యాప్తంగా ఫారం పాండు గ్రౌండింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. జిల్లాలో 11 వేల ఫారం పాండ్లు నిర్మించడం లక్ష్యం కాగా ఇప్పటివరకు 7432 ఏర్పాటుచేసి 68 ప్రగతి సాధించారన్నారు. అదేవిధంగా పల్లె పండుగలో చేపట్టిన గోకులం షెడ్లు 1200 లక్ష్యానికి గాను 1112 నిర్మించి 92.67శాతం, సీసీ రోడ్లలో 177.76కిమీలు లక్ష్యానికి 133.41 కిమీ లు నిర్మించి 75 ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. లక్ష్యం మేరకు తప్పనిసరిగా ప్రగతి సాధించాలన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడరాదని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ద్వామా పీడీ వెంకటరత్నం, పంచాయతీరాజ్ ఎస్ ఈ దయాకర్ రెడ్డి, ఇన్చార్జి డిపిఓ తదితరులు పాల్గొన్నారు.

# మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి



**ఎడ్యుకేషన్: మార్చి 21, ప్రభాతవార్త:**

వేడి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 3 వ తేదీ నుండి కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్ నందు జరగనున్న పదవ తరగతి మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలని యుటిఎఫ్ జిల్లా శాఖ విద్యాశాఖాధికారి షంషుద్దీన్ కు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సాయంత్రం కడపలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో షంషుద్దీన్ ను కలిసి యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున మూల్యాంకన కేంద్రంలో చలువ పందిర్లు, కూలర్లు, ఫ్యాన్లు తగినన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మంచినీటి వసతితో పాటు, మజ్జిగను కూడా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. మూల్యాంకన విధులకు 58 సంవత్సరాల వయస్సు పైబడిన ఉపాధ్యాయులను, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిని, వికలాంగులను, చంటి బిడ్డల తల్లులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే మూల్యాంకన విధులలో పాల్గొనుటకు ఆసక్తి ఉన్న వారి వివరాలను గూగుల్ ఫారమ్ ద్వారా సేకరించి విధులు కేటాయించాలన్నారు. టిఎఫ్ వినతి మేరకు డీఈఓ షంషుద్దీన్ మాట్లాడుతూ మూల్యాంకన కేంద్రంలో వసతి సౌకర్యాలను కల్పించడంలో రాజీపడబోమన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. మూల్యాంకన విధుల పారితోషికాన్ని వెంటనే చెల్లించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గోపీనాథ్, వీరనారాయణ, సుబ్బారావు, అనిల్ కుమార్, రామకేశవ, జమాల్‌బాషా, ప్రకాష్‌బాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు అద్భుత అవకాశాలు

**రాయచోటి, మార్చి 21ప్రభాత వార్త**

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించేందుకు విశేష కృషి చేస్తుందని నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా యువత నుండి అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తోంది అని తెలిపారు. చిన్న ఉద్యోగమైనా నిరాశ పడకుండా, అంచెలంచెలుగా ఎదగాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. త్వరలో అన్నమయ్య జిల్లాలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సహకారంతో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. యువత లక్ష్యంతో ముందుకు సాగితే విజయాన్ని సాధించగలరు. యువత ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకొని, దాని సాధన కోసం కృషి చేస్తే అనుకున్నది సాధించవచ్చని డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి ప్రేరేపించారు. క్రమశిక్షణ, నైపుణ్యం, కష్టపడే మనస్తత్వం ఉంటే ఉద్యోగ అవకాశాలు వారికి చేరువ అవుతాయి అని సూచించారు.

**342 మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు**

ఈ మెగా జాబ్ మేళాకు దాదాపు 646 మంది నిరుద్యోగులు హాజరై, అందులో 342 మంది అభ్యర్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వకారణమని జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ నాగార్జున వెల్లడించారు. మెగా జాబ్ మేళాలో అన్నమయ్య జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ నాగార్జున,



జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ, SSITS డైరెక్టర్ రాజపుత్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు. శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ, "ఇలాంటి జాబ్ మేళాల ద్వారా గ్రామీణ విద్యార్థులకు పట్టణ ప్రాంత కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు లభించేందుకు ఇది అద్భుతమైన వేదిక" అని పేర్కొన్నారు. జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులకు "మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో భోజన వసతి అందించడం విశేషం. దీని ద్వారా నిరుద్యోగులు ఆహారం, వసతి కష్టాలను అధిగమించి మెగా జాబ్ మేళాలో పాల్గొనే అవకాశం పొందారు. మెగా జాబ్ మేళా విజయవంతం కావడం SSITSకు గర్వకారణమని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, యువత విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు.

# పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చెందాలి



మిట్స్‌లో ఐపియాత్రలో ముఖ్యఅతిధికి సన్మానిస్తున్న దృశ్యం

**కురబలకోట, మార్చి 21 ప్రభాతవార్త :**

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చెందాలని ఇంటర్‌నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జేఏ.చౌదరి అన్నారు. శుక్రవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మేథో సంపత్తి యాత్ర కార్యక్రమాన్ని కళాశాల ఛైర్మెన్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఆర్‌ఆర్‌అకాడమి అధ్యక్షులు ఎన్.ద్వారకనాథ్, ముఖ్యఅతిధి జేఏ.చౌదరిలు జ్యోతి ప్రజ్వళనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిధి చౌదరి మాట్లాడుతూ ఇంటెలెక్టవ్ ప్రాపర్టి రైట్స్ యొక్క విలువ అవసరం ఎంతైనా ఉందని ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి టెక్నాలజీకి కమ్యూనికేషన్ చాలా అవసరమని కనెక్ట్ కొలాబ్రేషన్, మెంటలింగ్ మూలదనం, మార్కెట్‌యాక్సిస్ అవసరమని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగ అవకాశాల కోసమే కాకుండా ఉద్యోగ అవకాశాలుకల్పించేలా కృషిచేయాలన్నారు. అందుకు కావాల్సిన అన్ని సదుపాయాలు మిట్స్ కళాశాల యాజమాన్యం కలిపిస్తుందని తెలిపారు. న్యూ ఏఐ వెంచర్ స్టుడియో స్థాపనకు కళాశాలతో ఒప్పందం చేసుకొన్నారు. ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కెఎల్‌ఎస్.రెడ్డి మాట్లాడుతూ మేథో సంపత్తియాత్ర మొట్టమొదటిసారిగా ఈ కళాశాలలో ప్రారంభించామని ఆయన తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి మాట్లాడుతూ ఇన్నోవేటీవ్ ఐడియాలను టెక్నాలజీలను, మరియు పెటెంట్‌లను కాపీరైట్స్ ద్వారా భద్రత కల్పించాలని తద్వారా పిఎం నరేంద్రమోడీ, సిఎం నారా చంద్రబాబునాయుడులు వికసిత భారత్ ఆశయాలను సాధించవచ్చునని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ కళాశాల సాదించిన విజయాలతో పాటు ఇప్పటి వరకు వందకు పైగా పరిశ్రమలతో చేసుకొన్న ఒప్పందాలు, మరియు ఐడియాల్యాబ్స్ సాధించిన ఇన్నోవేటీవ్ ప్రాజెక్టులను తెలిపారు. ఈ కార్యక్రమానికి మొదటిరోజున 500లకు పైగా వివిధ కళాశాలల అధ్యాపకులు,. విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు వారి వారి ఉత్పత్తులను ప్రదర్శన చేశారు.

# వైద్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన

### ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉద్రిక్తత

**మదనపల్లె క్రైమ్, మార్చ్ 21 ప్రభాతవార్త.**

కురబలకోట మండలంలోని ముదివేడు వద్ద గురువారం సాయంత్రం రెండు బైకులు ఎదురెదురు ఢీకొని ముదివేడుకు చెందిన హసన్ సాబ్ కొడుకు మోలాలి(24) తీవ్రంగా గాయపడిగా, మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో డాక్టర్లు వైద్యం అందించకపోవడం వల్ల మోలాలి చనిపోయాడని మృతిని బంధువులు ఆరోపిస్తూ జిల్లా ఆస్పత్రి ఎదుట బైఠాయించి ధర్నాకు పూనుకున్నారు. రెండు గంటలకు పైగా ధర్నా చేయడంతో సుమారు ఐదు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. అత్యవసర విభాగాన్ని ముట్టడించి ఆందోళనను ఉదృతం చేశారు. డాక్టర్లన్నీ సస్పెండ్ చేసే వరకు వదిలిపెట్టేది లేదని నిరసనలు తెలిపారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పిన వారు తమకు న్యాయం జరిగే వరకు విరమించబోమని భీష్మించుకుని కూర్చున్నారు. గురువారం సాయంత్రం డ్యూటీలో ఉన్న డాక్టర్లను సస్పెండ్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. చివరకు మెడికల్ సూపరింటెండెంట్ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

**వైద్యుల కొరతను తీరుస్తాం: ఎమ్మెల్యే షాజహాన్ భాష**

మదనపల్లి ఆసుపత్రిలో ఉండే వైద్యుల కొరతను తీరుస్తామని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష హామీ ఇచ్చారు. మృతుని బంధువులు రోడ్డుపై ధర్నా చేసిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రకటించిన హాస్పిటల్ చేరుకుని మెడికల్ సూపరింటెంట్ తో చర్చించారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది, మందులు కొరత ఉన్నట్లు సూపరింటెండెంట్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే హెల్త్ కమిషనర్ కు ఫోన్ చేసిన ఎమ్మెల్యే ఆసుపత్రి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారం రోజుల్లో అన్ని సమస్యల పరిశీలిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



# మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన

**బద్వేలు అర్బన్, మార్చి 21, ప్రభాతవార్త**

పట్టణంలోని చైతన్య డిగ్రీ కళాశాల లో శుక్రవారం బద్వేల్ పట్టణ సి.ఐ రాజగోపాల్, మరియు ఎక్సైజ్ శాఖ సి.ఐ సీతారామి రెడ్డి ,ఎస్సై గౌస్ బాషాలు విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం వలన కలిగే నష్టాలపై సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ అధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలు తెలియజేశారు. చాలామంది యువత మత్తుపదార్థాలకు బానిసలు అవుతున్నారని, వారి ఉజ్వల భవిషత్తును నాశనం చేసుకుంటున్నారని, తల్లి దండ్రులను,కుటుంబాలను ఆదుకోవలసిన యువత నేడు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, మాదక ద్రవ్యాలు వాడకూడదని సమాజాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదని, మత్తుపదార్థాల రహిత సమాజానికి కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ అనంతరము విద్యార్థులు మరియు అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండంట్ మన్యం గౌతంకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్/ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.నరసింహులు, కే.గౌరీశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.




# అడవులు మన జీవనానికి అత్యంత అవసరం



**ఒంటిమిట్ట మార్చి 21 ప్రభాతవార్త**

అడవులు మన జీవనానికి అత్యంత అవసరమని ట్రైన్ ఐఎఫ్ ఎస్ అధికారి శ్రీకాంత్ తెలిపారు శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం పురస్కరించుకొని ఒంటిమిట్టలోని సాయి భారతి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఐఎఫ్ఎస్ అధికారి శ్రీకాంత్ అడవుల ప్రాముఖ్యత వాటి సంరక్షణ అవసరం అటవీ చట్టాల పాత్ర తదితర అంశాలపై సందేశం అందించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు మన జీవనానికి అత్యంత అవసరమని ఇవి వాతావరణ సమతుల్యతను కాపాడమే కాకుండా మనకు ఆక్సిజన్ ను జీవవైవిద్యం మట్టి సారవంతత వంటి అనేక ప్రాణదార మార్గాలను అందిస్తాయన్నారు అడవుల వినాశనం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు అవగాహన కలిగి అడవులను రక్షించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు అటవీరంగంపై మక్కువ పెంచుకునేలా చూడాలన్నారు అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు పాఠశాల కరస్పాండెంట్ రామ తులసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు నాడున మొక్కను నాటాలన్నారు ఇది పర్యావరణ పరిరక్షణకు మన వంతు కృషి అన్నారు ఒక వ్యక్తి జీవిత కాలంలో కనీసం 50 మొక్కలు నాటితే భవిష్యత్ తరాలకు ఇవ్వగలమన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బరామయ్య అటవీ క్షేత్ర అధికారి నాగు నాయక్ ఫారెస్ట్ శిక్షణ ఆఫీసర్ బ్రహ్మయ్య అటవీ శాఖ అధికారులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మతల్లి దేవర మహోత్సవం



**మైదుకూరు, మార్చి 21, ప్రభాతవార్త:**

పట్టణంలో శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి దేవర మహోత్సవంలో సందర్భంగా శుక్రవారం మొదటిరోజు అమ్మవారికి తెల్లవారుజామున ప్రత్యేక పూజలతో మొదలుకొని అమ్మవారికి పట్టణంలోని ప్రజలు చల్ల అమ్మవారికి సమర్పించారు అంతేకాకుండా పెద్ద ఎత్తున విద్యుత్ అలంకరణతో నంద్యాల రోడ్డు ప్రొద్దుటూరు రోడ్డు అమ్మవారి విగ్రహాల విద్యుత్ అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, మహిళలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### అంగన్వాడీ కార్యకర్తలు

# సామర్థ్యాభివృద్ధిని పెంచుకోవాలి



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న పిడి

**పీలేరు మార్చి 21 ప్రభాతవార్త :**

అంగన్వాడీ కార్యకర్తలు సామర్థ్యాభివృద్ధిని పెంచుకోవాలని అన్నమయ్య జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. రమాదేవి తెలిపారు. అంగన్వాడీల్లో విద్యా నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల స్థాయి అంగన్వాడి కార్యకర్తలకు నిర్వహిస్తున్న పోషణ్ భీ పఢాయి భీ రెండవ రోజు శిక్షణ కార్యక్రమాన్ని పిడి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలిసిన మీడియాతో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను సుశిక్షితులైన కార్యకర్తలతో అభ్యాస కేంద్రాలుగా మార్చడానికి మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని అన్నారు. పిల్లల్లో భౌతిక, మేధో, ప్రారంభ భాష, సామాజిక భావోద్వేగం, సాంస్కృతిక సౌకర్యాభివృద్ధి, అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామని అన్నారు. అంతేకాకుండా ప్రధానంగా 03 సంవత్సరాల వయస్సు పిల్లలకు ప్రారంభ ఉద్దీపన, దివ్యాంగ పిల్లలతో సహా 36 సంవత్సరాల వయస్సు పిల్లలకు బాల్య సంరక్షణ, విద్యను ప్రోత్సహించడం, ఈసిసిఈ పాఠ్యాంశాలు, బోధనా విధానాలపై ప్రాథమిక అవగాహనతో అంగన్ వాడీ కార్యకర్తల సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, పోషన్లో ఆవిష్కరణలు, పోషన్ ట్రాకర్, ఫీడింగ్ పద్ధతులు, సూక్ష్మ పోషక లోపాలు మొదలైన వాటితో సహా పోషకాహారంపై అంగన్వాడీ కార్యకర్తల అవగాహనను బలోపేతం చేయడానికి ఈ శిష్యుల ఎంతో ఉపయోగపడనుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ రాజమ్మ, సూపర్వైజర్లు స్వరూప, స్వర్ణ, అక్కయ్య, ఉమ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కురబలకోట ఎంపిపిగా భూదేవి

**కురబలకోట, మార్చి 21 ప్రభాతవార్త :**

మండల అధ్యక్షురాలిగా భూదేవిని దాదాపుగా ఖరారైంది. ఇదివరకే కురబలకోట ఎంపిపి దస్తగిరిసాబ్ అనారోగ్య కారణంగా మెడికల్ సెలువుపై వెళ్ళడం జరిగింది. ఈ మేరకు జడ్పి సిఈఓకు ఎంపిపి దస్తగిరిసాబ్ లేఖ అందజేశారు. దీంతో వైస్ ఎంపిపిగా ఉన్న భూదేవిని ఎంపిపిగా నియమించాలని సిఈఓకు పంపిన లేఖలో పేర్కొన్నాడు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల వైసిపి నాయకులు ఎంపిడిఓ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎంపిపిగా తనకు అవకాశం కల్పించాలని ఎంపిటిసిల మద్దతు కోరి వైస్ఎంపిపి భూదేవి కురబలకోట మండల పరిషత్ ఏఓ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. వైసిపి హాయాంలో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో మోజర్టీ స్థానాలు వైసిపి కైవసం చేసుకొంది. బిసికి చెందిన అంగళ్ళు ఎంపిటిసి దస్తగిరిసాబ్‌ను ఎంపిపిగా ఎన్నుకోవడం జరిగింది. తొలి వైస్ ఎంపిపిగా మట్లివారిపల్లెకు చెందిన ఎంపిటిసి రమణారెడ్డిని ఎన్నుకొన్నారు. అనంతరం రెండవ వైస్ ఎంపిపిగా అంగళ్ళు 2 కు చెందిన ఎంపిటిసి భూదేవిని నియమించడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మండల సర్వసభ్య సమావేశాలను జరగనీయకుండా టిడిపి శ్రేణులు అడ్డుకొన్నారు. ఈ నేపథ్యంలో వైసిపి వారు హైకోర్టును ఆశ్రయించి సమావేశాలు సజావుగా నిర్వహించేలా ఉత్తర్వలు పొందారు. జిల్లా ఉన్నతాధికారులు ఎంపిడిఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. దీంతో సమావేశం జరిగింది. మండల సర్వసభ్య సమావేశం మరి కొద్దిరోజుల్లో జరపాల్సి ఉంది. ఇటీవల జరిగిన రాజకీయ కారణాలతో ఎంపిపి దస్తగిరి సెలవుపై వెళ్ళడంతో ఎంపిపి ఎన్నిక నిర్వహించి సమావేశం నిర్వహించాలని వైసిపి అధిష్టానం అంచనాకు వచ్చింది. మొదటి వైస్ ఎంపిపి రమణారెడ్డి రాజీనామా చేస్తానని ప్రకటించడంతో రెండవ వైస్ ఎంపిపి భూదేవికి ఎంపిపిగా అవకాశం లభించనున్నది. ఈ కార్యక్రమంలో వైసిపికి చెందిన సర్పంచ్‌లు పోరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, తెట్టు మనోహర్‌రెడ్డి, ఆర్‌కె.క్రిష్ణారెడ్డి, సుజాత, రామస్వామిరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి రమణారెడ్డి, మెజార్టీ ఎంపిటిసిలు ఆనందరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ఎంపిపిగా నియమించాలని కోరుతూ వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

# పదవ తరగతి పరీక్షలపై ఆకస్మిక తనిఖీ



**రాయచోటి, మార్చి 21ప్రభాత వార్త**

రాయచోటిలోని నేతాజీ సర్కిల్ దగ్గర గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణను శుక్రవారం జిల్లా కలెక్టర్ చామకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి మరియు ఆ శాఖ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల అధికారులకు తమ సూచనలు చేశారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీలో టెక్‌ఫెస్ట్ 2025 ఆవిష్కరణ



**(అన్నమయ్య ప్రతినిధి, ప్రభాతవార్త)**

అన్నమాచార్య యూనివర్సిటీలో టెక్‌ఫెస్ట్ 2025 కరపత్రాన్ని శుక్రవారం రోజు వైస్ చాన్సలర్ సాయిబాబారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా. ఎస్.ఎం.వి. నారాయణ, ప్రిన్సిపాల్, డా. ఎన్. మల్లికార్జునరావు, రిజిస్ట్రార్, అన్నమాచార్య యూనివర్సిటీ, కన్వీనర్ డా. ఎం. సుబ్బారావు, డీన్‌స్టూడెంట్ అఫైర్స్, అన్ని శాఖల డీన్‌లు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టెక్‌ఫెస్ట్ 2025 ఏప్రిల్ 9, 10 తేదీల్లో నిర్వహించబడనున్నట్లు తెలియజేశారు. ఈ టెక్‌ఫెస్ట్ విద్యార్థుల సాంకేతిక విజ్ఞానాన్ని, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే వేదికగా నిలుస్తుందని వి సి డా. ఈ. సాయి బాబా రెడ్డి అన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బృందచేతన, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా పలు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రధానంగా పేపర్ ప్రెజెంటేషన్, మోడల్ ఎక్స్పో, పోస్టర్ ప్రెజెంటేషన్, టెక్నికల్ క్విజ్, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, ట్రెజర్ హంట్, కోడింగ్ పోటీ, బిజినెస్ క్విజ్, సైన్స్ ఎక్స్పో వంటి కార్యక్రమాలు ఈ టెక్‌ఫెస్ట్‌లో భాగంగా ఉంటాయని నిర్వాహకులు వివరించారు. సాంకేతిక మరియు నోనటెక్నికల్ ఈవెంట్స్ ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల విద్యార్థులు ఈ టెక్‌ఫెస్ట్‌లో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులు, నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# ఘనంగా శయనోత్సవం

**రామసముద్రం మార్చి21 ప్రభాత వార్త**



మండల కేంద్రంలోని చెంబకూరులో వెలసి ఉన్న శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు భాగంగా శనివారం శయనోత్సవం ఆలయ అర్చకులు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయాన్నే సుప్రభాత సేవ మేలు కొల్పి పలురకాల పుష్పలతో అలంకరణ చేసి అభిషేకాలు అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామిని దర్శనం చేసుకున్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తుల దర్శనం చేసుకున్నారు. బ్రహ్మోత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమస్యలపై విన్నవించిన రితేష్

**బద్వేలు, మార్చి 21 ప్రభాతవార్త**



నియోజకవర్గ పరిధిలో నెలకొని ఉన్న పలు ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి విన్నవించినట్లు బద్వేలు నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త రితేష్ రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా కాశీనాయన ఆలయ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సహకారం అందించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందన్నారు. అదేవిధంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, ముఖ్యంగా నియోజకవర్గంలోని పలు నీటిపారుదల ప్రాజెక్టులపై చర్చించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరాన్ని వివరించడ మైందన్నారు. అంతేగాక భాకరాపేట తాటిచెర్ల మోటు రోడ్డు ను జాతీయ రహదారిగా అప్డేట్ చేసి జాతీయ ప్రాజెక్టులలో చేర్చాలని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ టక్కరిని కలిసి వినతి పత్రం అందించినట్లు తెలిపారు.,నియోజకవర్గ పరిధిలో పలువురు పేదలకు అందించాల్సిన సీఎంఆర్ ఎఫ్ చెక్కుల విడుదల చేయాలని కోరడం జరిగిందన్నారు. సంబంధిత ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారన్నారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

### - చిత్తూరు వ్యవసాయ శాఖ డీడీఏ మధుసూదన్‌రెడ్డి

**గాలివీడు, మార్చి 21(ప్రభాతవార్త):**

ప్రస్తుత నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని చిత్తూరు వ్యవసాయ శాఖ డీడీఏ మధుసూదన్‌రెడ్డి రైతులకు సూచించారు. ఆయన శుక్రవారం పూలికుంట గ్రామంలో ఉలవల పంపిణీ, ఉలవ పంట సాగుపై బండమీదపల్లి, రెడ్డివారిపల్లెలలో క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటసాగుపై రైతుల దగ్గర నుంచి వివరాలను సేకరించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పార్థసారథిరెడ్డి ఆధ్వర్యంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో ప్రభుత్వం అందించిన ఉలవల ద్వారా అధిక విస్తీర్ణంలో ఈ ప్రాంతంలో రైతులు సాగు చేశారని దిగుబడి కూడా ఎక్కువగా ఉన్నదని తెలిపారు. ప్రతి రైతు పంట మార్పిడి ద్వారా భూసారాన్ని కాపాడాలని తెలిపారు. అనంతరం ఉలవ పంట సాగు చేసిన రైతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శివప్రసాద్, ఏఓ గౌతమి, ఏపీఎంఐపీ డీసీఓ శివశంకర్, మాజీ సర్పంచ్ నాగన్న, మాజీ సొసైటీ డైరెక్టర్ కొండారెడ్డి, రైతులు నాగేశ్వరరావు, గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

